ఆదివారం
19-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 238
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అనపర్తి ఘటనలో చంద్రబాబుపై కేసు

వెయ్యి మంది టీడీపీ కార్యకర్తలపై కూడా

అనపర్తి ఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చంద్రబాబు సహా వెయ్యి మంది పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

3లో

వివేకా హత్యకేసు

అవినాష్‌రెడ్డికి మళ్లీ సీబీఐ నోటీసు

విశాలాంధ్ర-కడప:
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సీబీఐ అధికారులు శనివారం మరో సారి నోటీసు జారీ చేశారు. గత నెల 28న అవినాష్ రెడ్డి హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరైన విషయం విదితమే. తాజాగా ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ లోని తమ కార్యాలయానికి మరోసారి విచారణకు హాజరు కావాలని సీబీఐ అధికారులు వాట్సాప్ ద్వారా అవినాష్ కు నోటీసులు పంపారు. తనకు నోటీసులు అందిన విషయం వాస్తవమేనని ఆయన ధ్రువీకరించారు. కాగా వివేకా హత్య కేసులో రెండోసారీ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసుకు సంబంధించి అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కరరెడ్డికి కూడా సీబీఐ నోటీసు జారీచేసింది. 2019 మార్చి 15న వివేకా హత్య జరిగినప్పటి నుంచి.. ప్రతిపక్షాల వేళ్లన్నీ ఎంపీతో పాటు ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి వైపే చూపిస్తున్నాయి. 2020 మార్చి 11న హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టి 248 మంది సాక్షులు, అనుమానితులను విచారించి.. వాంగ్మూలాలను రికార్డు చేసింది. ఆ వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాలతో ఇప్పుడు కీలకమైన అవినాష్‌రెడ్డిని విచారిస్తోంది. గత నెల 28న అవినాష్‌రెడ్డిని విచారించిన తరువాత కాల్‌డేటా ఆధారంగా సీఎం జగన్ సతీమణి భారతి సహాయకుడు నవీన్, సీఎం ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డికి నోటీసులిచ్చి కడప కేంద్ర కారాగారంలో విచారించారు. తాజాగా అవినాష్‌రెడ్డిని విచారించేందుకు సీబీఐ మళ్లీ నోటీసు జారీచేయడం చూస్తే ఈ కేసులో సీబీఐ దూకుడు పెంచినట్టు అనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వివేకా కేసు హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

తారకరత్న కన్నుమూత

హైదరాబాద్ :
నందమూరి తారకరత్న (39) కన్నుమూశారు. తీవ్ర గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన ఆయన 23 రోజులుగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఇటీవల టీడీపీ నాయకుడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర తొలి రోజు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం పాదయాత్రలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న సమయంలో తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటు రావడంతో ఆయనను తొలుత కుప్పం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చేర్పించారు. విదేశాల నుంచి కూడా వైద్యులను రప్పించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. తారకరత్న మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. తారకరత్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. తారకరత్నకు భార్య అలేఖ్య, ఓ కూతురు ఉన్నారు. అలనాటి నటుడు ఎన్టీఆర్ కుమారుడు మోహన్‌కృష్ణ తనయుడే తారకరత్న. 1983 ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లో ఆయన జన్మించారు. కళాశాలలో చదువుతున్న

- మిగతా 2 లో

చలో తాడేపల్లి!

- వైసీపీలో ఎమ్మెల్సీ పదవుల జాతర
- సీఎం క్యాంపు కార్యాలయం వద్ద నేతల క్యూ
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం కసరత్తు
- రేపో, మాపో జాబితా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
రాష్ట్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రులతోపాటు, స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో అధికారపార్టీలో ఆశావాహుల హడావుడి ఎక్కువైంది. వైసీపీ అధిష్టానం ప్రస్తుతం అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో ఉంది. ఆ కసరత్తు తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. రేపో, మాపో ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడికి రంగం సిద్ధమవుతోంది. కుల సమీకరణలతోపాటు, పార్టీకి విధేయులుగా వ్యవహరిస్తూ ఇప్పటివరకు పదవులు పొందని వారు, ప్రతిపక్ష పార్టీ సభ్యుల ఆరోపణలకు గట్టిగా తిప్పికొట్టగలిన సత్తా ఉన్న నేతలను గుర్తించి, వారికున్న లక్షణాల్లో ప్లస్‌లు, మైనస్‌లు ఆధారంగా అధిష్టానం జల్లెడ పడుతోంది. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా సీఎం క్యాంపు కార్యాలయానికి ఆశావాహుల తాకిడి ఎక్కువైంది. స్థానిక సంస్థల్లో అత్యధిక శాతం సీట్లు వైసీపీ గెల్చుకుంది. దీంతో ఆ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు అధికారపార్టీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ చైర్మన్లు ఆశించిన వారు, ఇతర కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఆశించి భంగపడ్డవారంతా ప్రస్తుతం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇందుకోసం వారి జిల్లాలకు చెందిన మంత్రులు, వారి సొంత నియోజకర్గాలకు చెందిన శాసనసభ్యులు, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో పాటు, ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ చైర్మన్ ఎస్వీ సుబ్బారెడ్డి, పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వైసీపీ నేతలు పెద్దసంఖ్యలో తాడేపల్లి తరలి

- మిగతా 2 లో

27 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- రెండు విడతలుగా నిర్వహణ... తొలుత రెండ్రోజులు
- మార్చి 6 నుంచి మళ్లీ ప్రారంభం
- మొత్తం 13 రోజుల పాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నెలాఖరులో ప్రారంభం కానున్నాయి. ఈసారి రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. తొలుత రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. ఈనెల 27న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, మొదటి రోజున గవర్నర్ ప్రసంగం, బీఏసీ సమావేశం ఉంటాయి. రెండో రోజు సంతాప తీర్మానాలు, వాయిదా ప్రకటన ఉంటాయి. తర్వాత సభ వాయిదా పడుతుంది. ఇక రెండో విడత సమావేశాలు మార్చి 6న ప్రారంభం అవుతాయి. మొత్తం బడ్జెట్ సమావేశాలను 13 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలోనే అసెంబ్లీ సమావేశాలు రెండు విడతలుగా జరపాలని నిర్ణయించినట్లు సమాచారం.

మోదీ విధానాలపై

రైతుల ఐక్యపోరాటాలు

కేరళ రైతు జాతాల ముగింపు సభలో ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య

త్రిసూర్:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వినాశకర రైతు చట్టాలకు వ్యతిరేకంగా దేశంలోని రైతులు ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. రైతు సమస్యలపై ఏఐకేఎస్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు జె.వేణుగోపాలన్ నాయర్ నేతృత్వంలో ఉత్తర ప్రాంత పాదయాత్ర, ప్రధాన కార్యదర్శి వి.చామున్ని సారథ్యంలో దక్షిణ ప్రాంత పాదయాత్ర జరిగాయి. దాదాపు 200 గ్రామాలలో పర్యటిస్తూ సాగిన ఈ రెండు జాతాలు త్రిస్సూర్‌లో కలిశాయి. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ జరిగింది. పెద్ద సంఖ్యలో రైతులు హాజరైన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రావుల వెంకయ్య మాట్లాడుతూ, ఈ రైతు సహాయ యాత్రలు దేశానికే ఆదర్శమని, రైతు రక్షక యాత్రల ద్వారా రైతుల సమస్యలను అధ్యయనం చేసి చర్చించవచ్చున న్నారు. భారతదేశమంతటా ఇలాంటి పర్యటనల ద్వారా రైతులకు సహాయం చేయవచ్చని కూడా ఆయన అన్నారు. నరేంద్ర మోదీ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు ఏడాది పాటు సమ్మె చేశారని, స్వాతంత్ర్యానికి ముందు లేదా తర్వాత ఇలాంటి పోరాటం లేదని గుర్తుచేశారు. కుల, మత, వర్ణ, వర్గాలకు అతీతంగా వేలాది మంది రైతులు, కూలీలు ఏకమై సమ్మెలో పాల్గొన్నారన్నారు. నిరంతర పోరాటాల ఫలితంగా కేంద్రం తలవంచింది కానీ ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, దేశ

- మిగతా 2 లో

పేదల ఆహార భద్రతకు

ముప్పు

ఆకలి సూచీలో దేశం అట్టడుగున ఉన్న పరిస్థితుల్లో ఆహార సబ్సిడీకి ఎసరు పెట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదల ఆహార భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్లకు అమ్మేస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు... పేదల ఆకలి తీర్చే ప్రజాపంపిణీ వ్యవస్థను కూడా వదిలించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు స్పష్టమౌతోంది. మార్కెట్ నుంచి ఆహార ధాన్యాలను సేకరించి, వాటిని పేదలకు పంచే పీడీఎస్ వ్యవస్థ మొత్తాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడానికి వేగంగా అడుగులు వేస్తున్నట్టు కనబడుతోంది. అసలు ఆహార సబ్సిడీకే కేంద్రం మంగళం పాడనున్నదా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఆప్త మిత్రుడు అదానీకి ఏడు విమానాశ్రయాలను కట్టబెట్టే విషయంలో నీతి ఆయోగ్‌తోపాటు, ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా కేంద్రం పట్టించుకోలేదు. సన్నిహితుడి కోసం నిబంధనలు సైతం మార్చేసి అడ్డగోలుగా అప్పగించేసింది. ఆహార సబ్సిడీని ఎత్తేయాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రైవేటుకు కట్టబెట్టాలన్న నీతి ఆయోగ్ సిఫారసులు పేదలకు పిడుగుపాటులా పరిణమిస్తాయన్నా సంకోచించకుండా... బడ్జెట్‌లో ఫుడ్ సబ్సిడీకి కేంద్రం నిలువునా కోత విధించింది. ఈ విషయాలన్నీ 'రిపోర్టర్స్ కలెక్టివ్' అనే సంస్థ ఇటీవల ఆధారాలతో సహా బయటపెట్టింది.

- బడ్జెట్‌లో సబ్సిడీలపై భారీ కోత
- ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రైవేటుకు...
- కేంద్రానికి నీతి ఆయోగ్ సిఫార్సు
- బయటపెట్టిన 'రిపోర్టర్స్ కలెక్టివ్'

న్యూఢిల్లీ:
ఆకలి సూచీలో పొరుగుదేశాల కంటే మన దేశం అట్టడుగున నిలిచిన ప్రస్తుత పరిస్థితుల్లో... పేదలకు అంతో ఇంతో అక్కరకొస్తున్న ఆహార సబ్సిడీని ఎత్తివేసే దిశగా కేంద్రంలోని ఎన్డీయే సర్కారు అడుగులు వేస్తోంది. ఆహార సబ్సిడీని ఎత్తివేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రైవేట్‌కు అప్పగించాలని ప్రభుత్వ మేధో సంస్థ నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్టు 'రిపోర్టర్స్ కలెక్టివ్' అనే సంస్థ గత వారంలో ఆధారాలు బయటపెట్టింది. ఈ సిఫారసులకు అనుగుణంగా తాజా బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి కేంద్రం భారీగా కోత విధించింది. పీడీఎస్ వ్యవస్థను వేగంగా ప్రైవేటుపరం చేయాలని నీతి ఆయోగ్‌లోని ప్రాజెక్ట్ అప్రైజల్ అండ్ మేనేజ్‌మెంట్ డివిజన్, 2019 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి రాసిన ఓ లేఖను రిపోర్టర్స్ కలెక్టివ్ బయటపెట్టింది. 'జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద ప్రస్తుతం పేదలకు ఆహార ధాన్యాలను అందించేందుకు కొనసాగుతున్న

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీరిచ్చిన డబ్బులతో ఇళ్లు కట్టాలంటే ఇంతవరకే కట్టగలం జగన్ బాబూ!

ప్రతిపక్షం ఐక్యతతోనే

బీజేపీకి చెక్

- 'భారత్ జోడో' జోష్ తగ్గనివ్వొద్దు
- కాంగ్రెస్ పార్టీకి నితీశ్ కుమార్ సలహా

పాట్నా:
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో దేశంలో భారత్ జోడో యాత్ర విజయవంతంగా సాగిందని, ఆ జోష్ ఏ మాత్రం తగ్గకుండా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీకి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సలహా ఇచ్చారు. ఐక్యవిపక్షంతోనే బీజేపీకి చెక్ పెట్టొచ్చన్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని

- మిగతా 2 లో

కనీస సదుపాయాల లేమి

- భక్తుల ఆగ్రహం
- నల్లమల్లలో ట్రాఫిక్ అంతరాయం
- జనసంద్రమైన శ్రీశైలం

విశాలాంధ్ర - శ్రీశైలం:
మహాశివరాత్రి సందర్భంగా కర్నూలు జిల్లాలోని శ్రీశైలానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో తెల్లవారుజామున 2గంటల నుంచే ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండటం, కనీసం తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో దేవస్థానం అధికారుల తీరుపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు సున్నిపెంట వద్ద శివ దీక్ష భక్తులు నిరసనకు దిగారు. హైదరాబాద్, తెలంగాణ ప్రాంతం నుంచి వాహనాల్లో ఉదయం శ్రీశైలం వస్తుండగా పోలీసులు సున్నిపెంట వద్ద అడ్డుకున్నారు. శ్రీశైలంలో పార్కింగ్ సదుపాయం లేదంటూ వాహనాలు నిలిపివేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు భక్తులను శ్రీశైలంలోకి అనుమతించారు.శ్రీశైలం వచ్చే అన్ని

- మిగతా 2 లో

ప్రైవేటీకరించి

తప్పుచేశారు

- ప్రభుత్వరంగంలోనే ఉత్తమం
- ఎయిరిండియా పనితీరుపై ప్రధాని సలహాదారు ఆగ్రహం

2లో

జర్మనీలో స్తంభించిన విమానయానం

- మెరుగైన వేతనాల కోసం 8 విమానాశ్రయాల సిబ్బంది సమ్మె
- 2,300 విమానాలు రద్దు

బెర్లిన్/ఫ్రాన్క్‌ఫర్ట్: జర్మనీలో విమానయానం స్తంభించింది. ఎయిర్‌ట్రాఫిక్ నిలిచిపోయింది. పెరుగుతున్న ధరలు,జీవన వ్యయం దృష్ట్యా సముచిత స్థాయిలో వేతనాల్లో పెంపుదల కోసం డిమాండ్ చేస్తూ ఎయిర్‌పోర్టు సిబ్బంది సమ్మెబాట పట్టారు. కార్మిక సంఘం వెర్డీ పిలుపుమేరకు ఫ్రాన్క్‌ఫర్ట్, మునిచ్, హాంబర్గ్‌తో సహా మొత్తం ఎనిమిది విమానాశ్రయాల్లో సిబ్బంది విధులను ఒకరోజు కోసం బహిష్కరించారు. దీంతో 2,300కుపైగా విమానసేవలు రద్దు కాగా మూడు లక్షల మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. కార్మికసంఘం వెర్డి పిలుపుమేరకు శుక్రవారం సమ్మె విజయవంతమైంది. జర్మనీలోని అతిపెద్ద విమానయాన సంస్థ లుఫ్తాన్సా 1,300కుపైగా విమానాలను రద్దు చేసింది. ఫ్రాన్క్‌ఫర్ట్, మునిచ్ విమానాశ్రయాల్లో ఎయిర్‌ట్రాఫిక్ స్తంభించింది. దేశీయ విమాన సేవలు నిలిచిపోయాయి. అయితే కార్మికుల సమ్మెను జర్మన్ ఎయిర్‌పోర్ట్ అసోసియేషన్ 'ఏడీవీ' తప్పుపట్టింది. ఇది పూర్తిగా ఆక్షేపణీయమని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలేగానీ ప్రయాణికులను ఇబ్బంది పెట్టి కాదని ఏడీవీ చీఫ్ రాల్ఫ్ బైసెల్ పేర్కొన్నారు. సమ్మె వల్ల బ్రీమెన్, దార్ట్‌ముండ్, హాంబర్గ్, హానోవర్, లెప్జి, స్టుగార్ట్ నగరాల్లోనూ వైమానిక సేవలకు అంతరాయం కలిగింది. ప్రభుత్వ రంగాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, ఎయిర్‌పోర్టు గ్రౌండ్ క్రూ, ఏవియేషన్ భద్రతా సిబ్బంది వేతనాలు పెంచాలని వెర్డీ పోరాడుతోంది. ఇప్పటికే యాజమాన్యాలతో దఫాలవారీ చర్చలు జరుపుతోంది.తదుపరి చర్చలు ఈనెల 22-23 తేదీల్లో జరగనున్నట్లు సమాచారం. వేతనాల్లో కనీసం 10.5శాతం పెంపునకు వెర్డి డిమాండ్ చేస్తోంది. ఎయిర్‌పోర్టు సిబ్బందికి బోనస్ పెంచాలని, సాయంత్రం పనివేళలు తగ్గించాలని, సెలవులు ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తోంది. ఆయా డిమాండ్లను యాజమాన్యాలు తిరస్కరించాయి. దీంతో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని వెర్డీ అధ్యక్షుడు ఫ్రాంక్ వెర్నెకె ఇప్పటికే హెచ్చరించారు. ఇదిలావుంటే జర్మనీలో వరుస సమ్మెలు జరుగుతున్నాయి. పరిశ్రమల్లో పనిచేసే వారు మొదలు పోస్టల్, ప్రజా రవాణా, నర్సులు మెరుగైన వేతనాల కోసం వీధుల్లోకి వచ్చి పోరాడుతున్న విషయం తెలిసిందే.

ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

సియోల్: దక్షిణ కొరియా, అమెరికా సంయుక్తంగా సైనిక విన్యాశాలను చేపట్టనుండటం ఉత్తర కొరియాకు కోపం తెప్పించింది. తమ దేశంపై దండ యాత్ర చేసేందుకు ఈ రెండు దేశాలు యత్నిస్తున్నాయని, ఈ విన్యాశాలను తేలిగ్గా తీసుకునే ప్రసక్తే లేదని ఇప్పటికే దక్షిణ కొరియా, అమెరికాకు స్పష్టం చేసింది. ఇదే క్రమంలో శనివారం జపాన్ సముద్రం వైపుగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని చేపట్టింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఈ క్షిపణి సామర్థ్యం గురించి, అది ఎంత వేగంగా ఎంత దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదన్న సమాచారాన్ని ఇవ్వలేదు. జనవరి 1న షార్ట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా విజయవంతంగా పరీక్షించింది. ఈ పరీక్షతో 2023లో అణ్వాస్త్రాల ప్రయోగానికి ప్యాంగ్యాంగ్ నాంది పలికిన విషయం విదితమే.

కరాచీ పోలీసు స్టేషన్‌పై ఉగ్రదాడి

ఐదుగురు ఉగ్రవాదులు సహా తొమ్మిది మంది మృతి

ఎమర్జెన్సీ ప్రకటన

కరాచీ: పాకిస్తాన్‌లోని కరాచీ పోలీసు చీఫ్ కేంద్ర కార్యాలయం ఉన్న భవనంపై ఉగ్రదాడి జరిగింది. తెహ్రీక్-ఇ-తాలిబాన్ (పాకిస్తాన్)కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి తెగబడ్డారు. దీంతో భద్రతా సిబ్బందికి, ఉగ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన వారిలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు, ఓ పౌరుడు, రేంజర్ సిబ్బంది ఉన్నారు. మొత్తంగా తొమ్మిది మంది మరణించారు. మరో 17 మంది గాయపడ్డారు. తాజా పరిణామాల క్రమంలో కరాచీలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఐదు అంతస్తుల భవనం వద్ద టీటీపీ ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య నాలుగు గంటలుకుపైగా సాగిన పోరు రాత్రి 10.50 గంటలకు ముగిసిందని అధికార వర్గాలు తెలిపాయి. ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారని, వారిలో ముగ్గురు కాల్పుల్లో చనిపోగా మరో ఇద్దరు ఆత్మాహుతికి పాల్పడ్డారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సింధ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ముర్తాజా వాహబ్ ట్విట్టర్ మాధ్యమంగా వివరాలను వెల్లడించారు. కరాచీ పోలీసు ఆఫీస్ (కేపీఓ) భవనం ఖాళీ అయిందని, ముగ్గురు ముష్కరులను మట్టుబెట్టామని వెల్లడించారు. గాయపడిన 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఇద్దరు పోలీసులు, రేంజర్ సిబ్బంది, ఓ సామాన్య పౌరుడు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. పోలీసు డీఐజీ (సౌత్) ఇర్ఫాన్ బలోచ్ స్పందిస్తూ భవనం వెనుక వైపు తలుపులు తీసివున్న రెండు కార్లను గుర్తించామని, శుక్రవారం రాత్రి 7.10 గంటలప్పుడు ఉగ్రవాదులు ఆ వాహనాల్లో వచ్చారన్నారు. కార్లలో పేలుడు పదార్థాల కోసం బ్యాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసిందని, ఉగ్రవాదులు పోరుకు సిద్ధమై వచ్చారని, ఆధునిక ఆయుధాలు వారి వద్ద ఉన్నాయన్నారు. పోలీసు యూనిఫారాలు ధరించి వారు లోనికి చొరబడినట్లు వెల్లడించారు. ఉగ్రవాదులు హ్యాండ్ గ్రనేడ్లు, ఆటోమెటిక్ గన్స్ ఉపయోగించినట్టు పాకిస్తాన్ మీడియా పేర్కొంది. గతంలోనూ మియాన్‌వాలి పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాదులు దాడి చేశారు.

అమెరికాలో వరుస కాల్పులు

మిస్సిసిపీలో ఆరుగురి కాల్చివేత: మృతుల్లో ఓ మహిళ

52ఏళ్ల నిందితుడి అరెస్టు - ఏడాదిలో 73వ ఘటన

వాషింగ్టన్: అమెరికాలో వరుసగా కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది 73వ కాల్పుల ఘటన మిస్సిసిపీలోని టటే కౌంటీలో జరిగింది. విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా అనేకమంది గాయపడ్డారు. శనివారం అర్కబుట్లలోని మూడు చోట్ల కాల్పులు జరిగాయని, అన్ని ఘటనల్లో కలిపి ఆరుగురు మరణించారని టటే కౌంటీ షరీఫ్ కార్యాలయం వెల్లడించింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. అతనిని అర్కబుట్లకు చెందిన రిచర్డ్ దలే క్రమ్ (52)గా గుర్తించినట్లు పేర్కొంది. ప్రస్తుతానికి హత్య ఆరోపణలతో కేసు నమోదు చేయగా అదనపు ఆరోపణలు త్వరలోనే చేర్చనున్నట్లు వెల్లడించింది. అర్కబుట్ల రోడ్డులోని ఓ షాప్‌లో చొరబడి రిచర్డ్ కాల్పులు జరిపగా ఇద్దరు చనిపోయారని, అక్కడే ఓ ఇంట్లోకి వెళ్లి మరో ఇద్దరిని కాల్చి చంపాడని, ఇంకో ఇద్దరిని అర్కబుట్ల డ్యామ్ వద్ద కాల్చివేసినట్లు షరీఫ్ కార్యాలయం తెలిపింది. మొదటి హత్య ఉదయం 11 గంటలప్పుడు జరిగిందని పేర్కొంది. మృతుల్లో ఓ మహిళ ఉన్నట్లు వెల్లడించింది. డ్యామ్ వద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు ప్రకటన పేర్కొంది.

ఇక చాలు: జోబైడెన్ ఆగ్రహం

తుపాకీ హింస ఒక అంటువ్యాధి అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇక చాలు. కొత్త ఏడాదిలో 48 రోజులు గడిచాయి. ఇంతలోనే 73 కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. తుపాకీ సంస్కృతి నశించాలి. ఇందుకోసం చట్టసభ చర్యలు తీసుకోక తప్పబోదు' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తుపాకీ చట్టాన్ని సంస్కరించాలని అన్నారు.

పేదల ఆహార భద్రతకు ముప్పు!

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే దానిలో ప్రభుత్వ , ప్రైవేటు భాగస్వామ్యానికి (పీపీపీ) అవకాశం కల్పించండి' అని ఆ లేఖలో నీతి ఆయోగ్ సూచించింది.

సరఫరా ప్రైవేటు చేతుల్లో పెట్టండి

జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50 శాతం జనాభాకు సబ్సిడీ ఆహార ధాన్యాలను అందించేందుకు అవకాశం ఉంది. అయితే అన్ని రాష్ట్రాలు పేదలకు ఈ సబ్సిడీ ఆహారధాన్యాలను అందించేందుకు 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకొంటున్నాయి. అయితే ఆ జనాభా లెక్కలకు ప్రస్తుతం కాలం చెల్లింది. గత 12 ఏళ్ల కాలంలో కొన్ని కోట్ల జనాభా దేశంలో పెరిగింది. కానీ, అందులోని పేదలను ప్రభుత్వాలు పీడీఎస్ పరిధిలోకి తీసుకురాలేదు. దీనిపై 2021లో సుప్రీంకోర్టులో పలువురు కేసులు దాఖలు చేయగా, కొత్తగా జనాభా లెక్కలు నిర్వహించిన తర్వాతనే పీడీఎస్ వ్యవస్థలోని మరింత మంది పేదలను తీసుకొస్తామని కేంద్రం తెగేసి చెప్పింది. ఇదే సమయంలో ఇప్పటికే పీడీఎస్ కింద ఆహార ధాన్యాలు పొందుతున్నవారిని కూడా ఏటా తొలగిస్తూ వస్తున్నది. దీనికి నీతి ఆయోగ్ సిఫారసులే కారణమని తాజాగా వెలుగులోకి వచ్చింది.

'జాతీయ, రాష్ట్రాల స్థాయిలో ఎంపికచేసిన ప్రాంతాల్లో ఆహార ధాన్యాల సేకరణ, తరలింపు, నిల్వతోపాటు బఫర్ స్టాక్ (భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ ఉంచేవి) నిల్వకు ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పించాలి... పీడీఎస్ వ్యవస్థను ప్రైవేటీకరించటం వల్ల ఆహార మార్కెట్‌లో ఇతర కంపెనీలకు అవకాశం లభిస్తుంది... ఇతర ప్రయోజనాలు కూడా ఉంటాయి' అని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచించినట్టు డాక్యుమెంట్లలో ఉంది. 'పీడీఎస్ కోసం ప్రస్తుతం ఎఫ్‌సీఐ, ఇతర రాష్ట్రాల ఏజెన్సీలు నిర్వహిస్తున్న ఆహార ధాన్యాల సేకరణ, తరలింపు, నిల్వ, పంపిణీ వ్యవస్థలో జాప్యం జరుగుతోంది. అవినీతి అధికంగా ఉంది. ఖర్చు కూడా భారీగా అవుతున్నది' అని పేర్కొంది.

సబ్సిడీలకు బడ్జెట్‌లో భారీ కోత

నీతి ఆయోగ్ సూచనలు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన 2023-24 బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించాయి. ఈ బడ్జెట్‌లో మోదీ సర్కారు అన్ని సబ్సిడీలకు భారీగా కోత పెట్టింది. సబ్సిడీల బడ్జెట్‌ను ఏకంగా దాదాపు రూ.1.5 లక్షల కోట్లు తగ్గించింది. దేశవ్యాప్తంగా పీడీఎస్ కోసం ఎఫ్‌సీఐ మార్కెట్ నుంచి ఆహార ధాన్యాలను సేకరిస్తుంది. చాలాచోట్ల రాష్ట్ర ప్రభుత్వాలే రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి ఎఫ్‌సీఐకి అందిస్తున్నాయి. ఈ ఏడాది సేకరించిన ఆహార ధాన్యాలకు సంబంధించి కేంద్రం ఎఫ్‌సీఐకి రూ.90,000 కోట్లు బకాయిలు ఇవ్వాల్సి ఉంది. కానీ, పైసా కూడా ఇవ్వకుండా మార్కెట్ నుంచి రుణాలు తెచ్చుకోవాలని ఎఫ్‌సీఐకి మోదీ సర్కారు సలహా ఇచ్చింది. అంత భారీగా రుణాలు తెచ్చుకొంటే వడ్డీలు కూడా భారీగా చెల్లించాల్సి ఉంటుంది.

ఇది ఎఫ్‌సీఐకి మోయలేని భారంగా మారి, అంతిమంగా ఆ సంస్థ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రం కూడా ఎఫ్‌సీఐ బలహీనపడాలనే కోరుకొంటున్నదని, ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని పీడీఎస్‌ను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టేందుకు పావులు కదుపుతున్నదని అంటున్నారు. ప్రస్తుతం ఆకలి సూచీలో దేశం అట్టడుగున ఉన్న పరిస్థితుల్లో ఆహార సబ్సిడీకి ఎసరు పెట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదల ఆహార భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, కొంతమంది ప్రముఖ జర్నలిస్టులు కలిసి ఏర్పాటుచేసిన వేదికే రిపోర్టర్స్ కలెక్టివ్.

ప్రైవేటీకరించి తప్పుచేశారు

న్యూఢిల్లీ: టాటాల ఆధీనంలో ఉన్న ఎయిరిండియా పై ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ వివేక్ దెబ్రాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఎయిరిండియాతో విసిగిపోయామని, ప్రైవేటీకరణ కంటే ముందే ఆ విమానయాన సంస్థ మెరుగ్గా ఉందని, ప్రైవేటీకరించి తప్పుచేశారని అన్నారు. ముంబయి నుంచి దిల్లీ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం ఆలస్యమవడంతో వివేక్ ట్విటర్ వేదికగా ఎయిర్‌లైన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు."ఎయిరిండియాతో విసిగిపోయా. ఈ ఎయిర్‌లైన్‌కు చెందిన విమానంలో దిల్లీకి టికెట్ బుక్ చేసుకున్నా. సాయంత్రం 4.35 గంటలకు విమానం బయల్దేరాల్సి ఉంది. కానీ విమానం ఆలస్యమైంది. దానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ప్రైవేటీకరణకు ముందే ఈ సంస్థ సేవలు మెరుగ్గా ఉండేవి" అని వివేక్ తెలిపారు. ఎక్కువ విమానాలు ఆర్డర్ చేసినంత మాత్రాన విమాన సేవలు వాటంతటవే మెరుగు పడవని ఆయన వరుస ట్వీట్లలో ఎద్దేవా చేశారు.

దీనికి ఎయిరిండియా బదులిస్తూ.. నిర్వహణ కారణాల రీత్యా విమానం ఆలస్యమైందని తెలిపింది. ప్రయాణికులకు సాయం చేసేందుకు తమ అధికారుల బృందం నిరంతరం శ్రమిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే ఎయిర్‌లైన్ స్పందనపైనా వివేక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎయిరిండియా బృందం ప్రయాణికులకు ఎలాంటి సాయం చేయలేదని మండిపడ్డారు. విమానయాన సంస్థ తీరుతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారని తెలిపారు. ఇకపై తాను ఎయిరిండియాలో ప్రయాణించబోనని తెలిపారు. ఏడు దశాబ్దాలుగా ప్రభుత్వ అధీనంలో ఉన్న ఎయిరిండియా ప్రైవేటీకరణలో భాగంగా గతేడాది జనవరిలో టాటా గ్రూప్ చేతుల్లోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ సంస్థ 470 విమానాల కొనుగోలుకు ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు ఆర్డర్ ఇచ్చింది.

ప్రతిపక్షం ఐక్యతతోనే బీజేపీకి చెక్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన నొక్కిచెప్పారు. లోక్‌సభలో 300కుపైగా స్థానాలతో బీజేపీ ఆధిపత్యంతో ఉందని, వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వంద స్థానాలు కూడా రాకుండా చేయాలన్నారు. 'భారత్ జోడో యాత్ర చాలా బాగా జరిగిందని, అక్కడితో ఆగిపోవద్దనే కాంగ్రెస్ మిత్రులకు నేను చెప్పదల్చినదని నితీశ్ కుమార్ అన్నారు. ఎన్డీయేతో తాము తెగతెంపులు చేసుకోవడం వల్ల రాష్ట్రంలో బీజేపీ విస్తరణ ప్రణాళికలు ఫలించలేదన్నారు. జాతీయ స్థాయిలోనూ ఇలా జరగాలన్నారు. తన సలహాను అనుసరించడంతో దేశానికే కాకుండా బీజేపీ బాధిత పార్టీలకూ ప్రయోజనం ఉంటుందని నితీశ్ అన్నారు. బీజేపీ పేరుగానీ ఆ పార్టీ నేతల పేర్లనుగానీ ప్రస్తావించకుండా తనదైన శైలిలో మాట్లాడిన నితీశ్ 'వీరి (కాషాయ పార్టీ) నుంచి విముక్తి పొందేందుకు లోక్‌సభ ఎన్నికలు సదవకాశమ'ని అన్నారు. ఆర్ఎస్ఎస్‌పై మోదీ ప్రభుత్వంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్య సమరంలో ఎలాంటి పాత్ర పోషించని వారు చరిత్రను తిరగరాస్తున్నారని ఎద్దేవాచేశారు. దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ అసంతృప్తి గళాలను అణచివేయాలని చూస్తున్నారని మోదీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 'తప్పు జరుగుతోందని ఎవరైనా అంటే వారికి పట్టే గతేమిటో తెలియనిది కాదు' అని నితీశ్ వ్యాఖ్యానించారు. దేశంలో పేట్రేగిన మనోన్మాదాన్ని దుయ్యబట్టారు. మహాకూటమిలో భాగమైన తర్వాత దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను కలిసినట్లు చెప్పారు. సీపీఐ(ఎంఎల్) జాతీయ మహాసభల్లో నితీశ్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, ఆర్జేడీ నేత, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజశ్వి యాదవ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుల ఐక్యపోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను, రైతులను దెబ్బతీసే విధానాన్ని మోదీ అనుసరిస్తున్నారన్నారు. ఏటా వ్యవసాయ రంగానికి కేటాయించే బడ్జెట్‌లో కోత పెడుతున్నారు. ప్రతి సంవత్సరం 500 కోట్లు కట్ చేసి వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నది చాలా తక్కువ మొత్తమని, కేంద్ర ప్రభుత్వం కూడా మద్దతు ధర తగ్గించిందన్నారు. బడ్జెట్ ప్రకటనలు వ్యవసాయ రంగాన్ని కుదిపేస్తున్నాయని, నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా మార్చి 20న అన్ని రాష్ట్రాల రైతులు దిల్లీకి మళ్లీ తరలివస్తున్నారని చెప్పారు. వాతావరణం, నీరు, వన్యప్రాణుల దాడుల వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతులను ఆదుకునేందుకు, అలాగే, పథకాల అమలు, కొత్త చట్టాల కోసం ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. అలాగే, ఈ నెల 23వ తేదీన జరిగే చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయాలని రైతులకు ఆయన పిలుపునిచ్చారు.

ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వీఎస్ సునీల్‌కుమార్ బహిరంగ సభకు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పి బాలచంద్రన్ స్వాగతం పలికారు. కిసాన్‌సభ జిల్లా అధ్యక్షులు కెకె రాజేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాలన్, చామున్నిలతోపాటు జాతా వైస్ కెప్టెన్ ఏపీ జయన్, డైరెక్టర్ మాథ్యూ వర్గీస్, జాతా సభ్యులు జాయ్‌కుట్టి జోస్, ఈఎన్ దాసప్పన్, ఆర్ చంద్రిక, ఉత్తర ప్రాంత జాతా కెప్టెన్ జె వేణుగోపాలన్ నాయర్, వైస్ కెప్టెన్ ఎ ప్రదీపన్, డైరెక్టర్ కెవి వసంతకుమార్, జాతా సభ్యులు టికె రాజన్ మాస్టర్, బంగళం కున్హికృష్ణన్ పాల్గొనగా, దీపా ఎస్ నాయర్ స్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి సత్యన్ మొకేరి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రాజేంద్రన్, సీపీఐ జిల్లా కార్యదర్శి కేకే వత్సరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీఎన్ జయదేవన్, కార్యదర్శి టీఆర్ రమేష్ కుమార్, జిల్లా కోశాధికారి టికె సుధీష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేపీ సందీప్, షీలా విజయకుమార్, రాకేష్ కణియంపరంపిల్, కేరళ మహిళాసంఘం జిల్లా అధ్యక్షురాలు షీనా పరయంగటిల్, జిల్లా కార్యదర్శి ఎం స్వర్ణలత, యువ కళాసాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇఎం సతీశన్, కెఎస్ జయ, టి ప్రదీప్ కుమార్, కెబి సుమేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పరేరి, జిల్లా అధ్యక్షులు బినోయ్ షెబీర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కెఎ అఖిలేష్, జిల్లా అధ్యక్షులు అర్జున్ మురలీధరన్ పాల్గొన్నారు.

సేవల్లో నాణ్యత పెంచండి

టెలికం ఆపరేటర్లకు ట్రాయ్ ఆదేశం

న్యూఢిల్లీ: సేవల్లో నాణ్యతను తక్షణమే పెంచాలని దేశంలోని టెలికం ఆపరేట్లు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక ఆదేశాలు జారీ చేసింది. సేవల్లో మెరుగుదల పెంచేందుకు అవసరమైన చర్యలను తక్షణం చేపట్టాలని సూచించింది.

ఫోన్ మాట్లాడుతుంటే మ్యూట్ అయిపోవడం, కాల్ మధ్యలో కట్ అవడం, ఒకవైపే వినిపిస్తుండటం వంటి సమస్యల ఫిర్యాదులు ఎక్కువయ్యాయని తెలిపింది. 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలు మరింత పెరిగిన నేపథ్యంలో టెలికం సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశమైన ట్రాయ్ వెంటనే దిద్దుబాటు చర్యలు ప్రారంభించాలని, సేవల్లో నాణ్యత పెంచాల్సిందేనని తేల్చిచెప్పింది.

ఐదేళ్ల జీఎస్టీ బకాయిలన్నీ తీరుస్తాం

- రూ.16,982 కోట్లు వెంటనే విడుదల
- స్టేషనరీపై పన్ను 12శాతానికి తగ్గింపు
- జీఎస్టీఆర్ దాఖలు ఆలస్య రుసుము హేతుబద్ధీకరణ
- జీఎస్టీ మండలి నిర్ణయాలు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కి సంబంధించి రాష్ట్రాలకు పెండింగ్ ఉన్న బకాయిలన్నింటిని చెల్లించేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రూ.16,982 కోట్లను తామే భరిస్తామన్నారు. శనివారం జరిగిన 49వ జీఎస్టీ మండలి భేటీ అనంతరం ఆమె ఈ మేరకు తెలిపారు. 'పెండింగ్ బకాయిలు అన్నీ తక్షణమే చెల్లించాలని నిర్ణయించాం. పరిహార నిధిలో అంత మొత్తం లేకపోయినాగానీ దానిని సొంత వనరుల నుంచి సర్దుబాటు చేస్తున్నాం. భవిష్యత్‌లో వసూలు చేసే సెస్ నుంచి ఈ నిధులను తిరిగి సమకూర్చుకుంటాం' అని ఆమె తెలిపారు. ఈ చెల్లింపులతో ఐదేళ్ల బకాయిలు తీరిపోతాయని అన్నారు. జీఎస్టీ రేట్లనూ ప్రకటించారు. స్టేషనరీ అయిన పెన్సిళ్లు, షార్పనర్లపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. డ్యూరబుల్ కంటైనర్లకు ఉపయోగించే ట్యాగ్స్ ట్రాకింగ్ పరికరాలపై ఉన్న 18శాతం పన్నును రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

యూపీ సహా పలు రాష్ట్రాల్లో లభించే రాబ్ గుడ్ (ద్రవ బెల్లం)పై పన్ను రేటును తగ్గించారు. ఈ బెల్లాన్ని ప్యాకింగ్ చేస్తే 5 శాతం, విడిగా అమ్మితే ఎలాంటి పన్నూ ఉండదని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్టీఆర్-9 దాఖలు విషయంలో ఆలస్య రుసుమును హేతుబద్ధీకరించారు. రూ.5 కోట్ల వరకు ఆలస్య రుసుమును రోజుకు రూ.50 గానూ, రూ.50-20 కోట్ల టర్నోవర్ కలిగిన వారికి రోజుకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఈ ఫీజు రూ.200గా ఉంది. గుట్కా, పాన్ మసాలా పరిశ్రమలు పన్ను ఎగవేత, జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు సంబంధించి రెండు వేర్వేరు మంత్రివర్గ ఉపసంఘాలు సమర్పించిన నివేదికలను స్వల్ప మార్పులతో ఈ సమావేశంలో ఆమోదించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. త్వరలో వీటిని సభ్యుల అభిప్రాయాల కోసం పంపుతామని, ఆ తర్వాత ఛైర్మన్ ఆమోదిస్తారని అన్నారు. 2017 జీఎస్టీ చట్టం ప్రకారం ఐదేళ్ల కాలానికి చెల్లించినట్లేనని ఆర్థిక శాఖ తెలిపిన క్రమంలో పరిహార బకాయిల కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.689 కోట్లు, తెలంగాణకు రూ.548 కోట్లు రానున్నాయి.

ఎల్‌జీ చర్యలకు ఆప్ నిరసన

రాజ్‌నివాస్ వద్ద ఎమ్మెల్యేల ఆందోళన

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పోకిరి చేష్టలకు వత్తాసు పలికినందున లెఫ్టినెంట్ గవర్నర్‌గా వీకే సక్సేనా తక్షణమే రాజీనామా చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేసింది. శనివారం సక్సేనా ఇంటి వద్ద ధర్నా చేపట్టింది. బీజేపీతో కుమ్మక్కై మేయర్ ఎన్నికను ఉద్దేశపూర్వంగా జాప్యం చేశారని నిరసనకారులు ఆరోపించారు. ఎమ్మెల్యే ఆతిషి, దుర్గేశ్ పాఠక్‌తో సహా అనేక మంది ఆప్ ఎమ్మెల్యేలు రాజ్ నివాస్ మార్గ్ వద్దకు బ్యానర్లతో చేరుకొని ఎల్‌జీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దిల్లీ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు ఆదేశాలు బీజేపీకి చెంపపెట్టు అని పాథక్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు దిల్లీలో ఎల్‌జీ చేసినవన్నీ రాజ్యాంగ విరుద్ధమైన పనులేనని, కోర్టు ఉత్తర్వులదే ఈ విషయం స్పష్టమైందని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సక్సేనా ఎల్‌జీగా ఎప్పుడూ రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలే తీసుకున్నారని, ఎల్లప్పుడూ బీజేపీకి గూండాగిరికి వత్తాసు పలుకుతూ వచ్చారని విమర్శించారు. దిల్లీ ప్రభుత్వాన్ని కాదన్న 'పెద్దలు' ఈయనకు ఎల్‌జీ పదవిని కట్టబెట్టారు. ఇప్పుడు ఎంసీడీ సభలో ఆ పెద్దలతో ఓటు వేయించేందుకు ప్రయత్నించారు. ఇంత జరిగాక దిల్లీ ఎల్‌జీగా సక్సేనా రాజీనామా చేయడం సబబు కాదా? ఇది గాంధీ, నెహ్రూ, శాస్త్రిల దేశం, ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన కార్యకలాపాలకు తావు ఉండదు' అని ఆయన మండిపడ్డారు.

సుప్రీంలో మా అభిప్రాయాలను చెప్పనివ్వలేదు: కేజ్రీవాల్

ఎంసీడీ వ్యవహారానికి సంబంధించి తమ అభిప్రాయాలను సర్వోన్నత న్యాయస్థానం ఎదుట ఉంచకుండా బలవంతంగా అడ్డుకునే ప్రయత్నాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ చేశారని సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ న్యాయ పరిపాలనలో జోక్యానికి ఎల్‌జీ యత్నించారని, కోర్టును ధిక్కరించారన్నారు. ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఓబరాయ్ (కేసులో పిటిషనర్) తన ఫిర్యాదులో ఎల్‌జీని, ఆప్ ప్రభుత్వాన్ని వేరు పక్షాలుగా పేర్కొన్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. గౌతం నారాయణ్‌ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించాలని పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిని దిల్లీ ప్రభుత్వం కోరిందని, ఆయనను వద్దని తుషార్ మెహతాను నియమించాలని ఎల్‌జీ ఈనెల 9న ఆదేశాలిచ్చారని వెల్లడించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి మీరు చేస్తున్నవన్నీ రాజ్యాంగ విరుద్ధమేనంటూ ఎల్‌జీకి రాతపూర్వకంగా తెలియజేశానని సీఎం కేజ్రీవాల్ తెలిపారు.

కనీస సదుపాయాల లేమి

(మొదటిపేజీ తరువాయి)

రహదారులు భక్తుల రాకతో కిక్కిరిసిపోయాయి. శనివారం లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో నల్లమలలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో భక్తులు, శివ స్వాములు, మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌లో జిల్లా ఉన్నతాధికారులు కూడా ఇరుక్కుపోయారు. నల్లమలలోని చిన్నారుట్ల నుంచి శ్రీశైలానికి, సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దర్శనం కోసం వేకువజామున రెండు గంటల నుంచి ఆలయ అధికారులు అవకాశాన్ని కల్పించారు. దీంతో క్యూ లైన్లు శివ స్వాములు, మహిళలు, చిన్నారులు, భక్తులు వీఐపీలతో కిక్కిరిసిపోయాయి. అటు తెలంగాణ ఇటు ఏపీ వీఐపీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

చలో తాడేపల్లి !

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 8 స్థానిక సంస్థలతోపాటు, రెండు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు మార్చి 13న ఎన్నిక జరుగనుంది. ఇందుకోసం నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా, ఈ నెల 23న నామినేషన్ల దాఖలుకు చివరి రోజు. దీంతో వైసీపీ నేతల్లో గంట గంటకూ ఉత్కంఠ పెరుగుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల కోటా నుంచి ఆశించేవారి సంఖ్య అధికంగా ఉంది. ఎందుకంటే ఇవి మొత్తం ఎనిమిది స్థానాలు దాదాపు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. దీంతో పార్టీకి చందా తప్ప, ఓట్ల కోసం పెద్దగా డబ్బు ఖర్చు పెట్టే అవసరం లేకపోవడంతో... ఆశావాహులు పెద్దసంఖ్యలో విజయవాడ నగరంలోని వివిధ హోటల్స్‌లో మకాం వేసి, విభిన్న కోణాల్లో తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.ఇటీవల తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలోకి వచ్చిన కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణకు దాదాపు అభ్యర్థిత్వం ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే కడప జిల్లాలో గతంలో టీడీపీలో కీలకనేతగా పేరొందిన రామసుబ్బారెడ్డికి కూడా సీటు ఖరారైనట్లు సమాచారం. మొత్తం 8 స్థానాలకు సామాజికవర్గ సమీకరణల్లో భాగంగా అందరికీ సమ న్యాయం జరిగేలా కేటాయింపులకు అధిష్టానం ప్రయత్నిస్తోంది. రాయలసీమ ప్రాంతం నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు పెద్దసంఖ్యలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ఆశిస్తున్నారు. అనంతపురం జిల్లా నుంచి కె.విజయభాస్కర రెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి విశ్రాంత ఐపీఎస్ అధికారి రెడ్డెప్ప రెడ్డి, కర్నూలు నుంచి మాజీ ఎమ్మెల్యే డి.పార్థసారథి రెడ్డి, ఆళ్లగడ్డకు చెందిన మరో సీనియర్ నేత రామపుల్లారెడ్డి, నంద్యాలకు చెందిన గోపాల్ రెడ్డి రేసులో ఉన్నారు. వీరందరిలో రామసుబ్బారెడ్డికి ఎక్కువ అవకాశాలున్నట్లు చెపుతున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే నీలకంఠం నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పద్మావతి,పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కారుమంచి రమేష్, తూర్పుగోదావరి జిల్లా నుంచి కె.సూర్యనారాయణ, నెల్లూరు నుంచి ముక్కామల ద్వారకానాథ్, మేరుగ మురళి పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి కూడా పోటీ ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో వైసీపీ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా వెల్లడించే అవకాశముంది.

తారకరత్న కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

సమయంలోనే నటనపై ఉన్న ఆసక్తితో 2002లో విడుదలైన 'ఒకటో నెంబర్ కుర్రాడు'తో ఆయన సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తొలి సినిమా విజయం సాధించడంతో తారకరత్నకు వరుస అవకాశాలు వరించాయి. అలా, ఆయన హీరోగానే కాకుండా విలన్, సహాయ నటుడిగానూ నటించి విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్నారు. 'యువరత్న', 'భద్రాద్రి రాముడు', 'అమరావతి', 'నందీశ్వరుడు' వంటి చిత్రాలు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'అమరావతి' చిత్రానికిగాను ఉత్తమ విలన్‌గా నంది అవార్డును అందుకున్నారు. ఇటీవల '9 అవర్స్' వెబ్ సిరీస్‌లో ఆయన నటించి ప్రేక్షకులను అలరించారు. రాజకీయాల్లోనూ చురుగ్గా ఉండే తారకరత్న టీడీపీ కార్యక్రమాల్లో తరచుగా పాల్గొనేవారు.

మాజీ మంత్రి జవహర్‌ని అవమానించిన

సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి

టీడీపీ రాష్ట్రనేతలు అచ్చెన్నాయుడు, యనమల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ మంత్రి జవహర్‌ను పోలీసులు అవమానించిన ఘటనపై సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో దళితులకు అడుగడుగునా, అన్యాయం, అవమానం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా మాజీమంత్రి కేఎస్ జవహర్ పట్ల అనపర్తి పోలీసులు దురుసుగా ప్రవర్తించడంతోపాటు, ఆయన ఫోన్, పర్సు లాక్కుని పోలీస్ స్టేషన్లో నేలపై కూర్చోబెట్టి అవమానించారన్నారు. రాష్ట్రంలో కొంతమంది పోలీసులు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారనీ, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ మానవ హక్కులను హరిస్తున్నారని తెలిపారు. రాజకీయ కక్షలో భాగంగానే మాజీ మంత్రి జవహర్‌ను, ఆయన సతీమణి, పిల్లలను పరుష పదజాలంతో దూషించారన్నారు. ఇది పోలీసుల దుశ్చర్యలకు తార్కాణం. కనీసం ఓ మాజీ మంత్రి అనికూడా చూడకుండా డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాస్ అమానుషంగా ప్రవర్తించారని తెలిపారు. అన్ని రోజులు ఒకలా ఉంటాయని పోలీసులు భ్రమపడుతున్నట్లు ఉన్నారు. ఈరోజు రేపులా ఉండదు అనే సత్యాన్ని, అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తించాలని వారు హెచ్చరించారు. దళితులంటే జగన్‌కి ఎందుకంత చిన్నచూపు ? మీ పాలనలో దళితులు కనీసం కుర్చీపై కూర్చోవడానికి కూడా అర్హులు కాదా ? అని ప్రశ్నించారు. వైసీపీ దళిత నేతల్ని జగన్ తన ఇంటి గుమ్మం బయట నిలబెడుతున్నారు, టీడీపీ దళిత నేతల్ని ఏమో పోలీసు స్టేషన్లలో నేలపై కూర్చోబెడుతున్నారు. ఇది యావత్ దళిత జాతికి అవమానం. జవహర్ ను అవమానించిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు కోరారు.

చంద్రబాబు భద్రత కోసమే లాఠీఛార్జి

ఐజీ పాలరాజు

విశాలాంధ్ర-భీమవరం టౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి భద్రత కోసమే లాఠీఛార్జి చేయవలసి వచ్చిందని ఐజీ పాలరాజు అన్నారు. శనివారం ఆయన భీమవరం రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా శనివారం అనపర్తి, బిక్కవోలు గ్రామాల మధ్య రోడ్ షో నిర్వహించగా అనుమతి లేదని ముందుగానే తెలియ జేశామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముందుగా అనుమతి కోరగా, విశాలమైన కొన్ని ప్రాంతాలను చూపించి ఏర్పాట్లు చేసుకోమని సూచించగా, వారు ఆ ప్రాంతాలను వదిలి రోడ్ షో నిర్వహించారన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం, పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలిపినప్పటికీ, అందుకు విరుద్ధంగా రోడ్ షో నిర్వహించారని అన్నారు. అనుమతి లేని రోడ్ షోని పోలీసు సిబ్బంది అడ్డుకోగా, మాజీ సీఎం చంద్రబాబు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా కొందరు వ్యక్తులు పోలీసు వాహనాలపై రాళ్ల దాడి చేశారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రికి భద్రత కారణాల రీత్యా కార్యకర్తలను చెదరగొట్టామన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ యు.రవి ప్రకాష్, డీఎస్పీ బి.శ్రీనాథ్, సీఐ కృష్ణకుమార్ తదితరులు ఉన్నారు.

పేరుకే భూసారం...ఆచరణ శూన్యం

- 82 గ్రామాలకు ఒకే పరిశోధన కేంద్రం
- ప్రకటనలకే ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: రైతు సంక్షేమ ప్రభుత్వం అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న ప్పటికీ వాస్తవాలు చేదుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 2015 ఫిబ్రవరిలో భూసార పరీక్షా కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించింది. మొదటి దఫా దేశంలో 12 కోట్ల రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇచ్చినట్లు ప్రకటించారు. 2018 లో రెండో దఫా 11 కోట్ల రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ జారీ చేసినట్లు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సమాచారం పొందుపరచారు. నిజానికి దేశంలో 7949 భూసార పరీక్షా కేంద్రాలు (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్) మాత్రమే ఉన్నాయి. ఇవి ఎంతమాత్రం సరిపోవు. 82 గ్రామాలకు ఒక ల్యాబ్ ఉంది. 23 కోట్ల కార్డులు ఏ ప్రాతిపదికన పంపిణీ చేశారో వారికే తెలియాలి. 98 శాతం రైతులకు వారు సాగు చేసే భూమి లోని లోపాలు గురించి తెలియదు. తెలిసినా దానికి తరుణోపాయం వ్యవసాయ అధికారులు చెప్పరు. అనంతపురం జిల్లా కేంద్రంలో ఒకటి, కదిరి, పెను కొండలో రెండు సబ్ యూనిట్లు ఉన్నాయి. గత మూడేళ్లుగా ఇవి నిస్తేజంగా ఉన్నాయి. నెలకు కనీసం పది మట్టి నమూనాలు పరీక్షించిన సందర్భాలు లేవు. ప్రభుత్వ భూసార పరీక్షా కేంద్రాలలో మట్టి పరీక్షలు జరపడానికి కావాల్సిన పరికరాలు, బఫర్ సొల్యూషన్స్, రియజెంట్లు లేక చాలా కాలమైంది. మట్టి సేకరించే మొబైల్ టెస్టింగ్ వాహనం ప్రమాదానికి గురై మూడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. చాల గ్రామాల్లో మట్టి సేకరణ జరగలేదు. వారికీ సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశారు. ఉన్న పరీక్షా కేంద్రాలలో సిబ్బంది చాలా తక్కువ. రైతు తీసుకెళ్లిన మట్టి నమూనాలో వీరు పరీక్ష చేసేది కేవలం ఎన్పీకే మాత్రమే మైక్రో న్యూట్రీషియన్ టెస్టు, భారలోహాలు టెస్టు, సల్ఫర్, జింక్, మాంగనీస్ ఇతరత్ర పరీక్షలు నిర్వహించరు. ఆరుగురు సిబ్బంది ఉమ్మడి జిల్లాలో ఉన్న రైతులందరికీ హెల్త్ కార్డులు జారీ చేశారంటే అది సాధ్యపడే విషయమేనా? రైతులందరికీ కార్డులు ఇవ్వాలంటే 70 ల్యాబ్స్ అవసరం అవుతాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రెండేళ్లకు మట్టి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవ దానికి భూసార పరీక్ష చేస్తూంటాయి. దీని ద్వారా నేలలో ఏ ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసు కోవచ్చు. మోదీ ప్రభుత్వం గ్రామాల్లో స్వయం ఉపాధి పొందాలని భావించే వారికి ఒక స్కీమ్‌ను అందిస్తోంది. అదే సాయిల్ హెల్త్ కార్డ్ స్కీమ్. గ్రామాల్లో ఈ పథకం కింద సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో ఉపాధి పొందొచ్చు. ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చవుతుంది. ఇందులో 75 శాతం అంటే దాదాపు రూ.3.75 లక్షలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెబుతారే కానీ బూటకపు ప్రకటనలు, ఆచరణకు నోచుకోని, ప్రచార ఆర్భాటాలకు ప్రభుత్వ పథకాలు పరిమితమయ్యాయి. ఖరీఫ్ సాగుకు ముందు కర్షకులు భూసార పరీక్షలు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ఈ పరీక్షల ద్వారా భూమి స్వభావం, మృత్తిక ఏ రకానికి చెందినదో, దానిలో ఉన్న పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. వాటిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చుల నుంచి విముక్తి పొందవచ్చు. భూసార ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల తదితర విషయాలు తెలుస్తాయి. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాల తోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అందుచేత ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి రైతులను లాభదాయక సాగువైపు దృష్టి సారించేలా తగిన మార్గదర్శనం చేయాల్సిన అవసరం ఉంది.

దమ్ముంటే నా మీద చూపించు నీ ప్రతాపం

సజ్జలకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సవాల్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: షాడో ముఖ్యమంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి చెప్పినట్లు పోలీసులు పని చేస్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రతాపరెడ్డి ఆరోపించారు. 'సజ్జల దమ్ముంటే నా మీదు చూపించు నీ ప్రతాపం... నా అనుచరులపై కాదు' అని సవాలు విసిరారు. శనివారం తన కార్యాలయంలో శ్రీధర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాడో ముఖ్యమంత్రి సజ్జల అన్ని పనులు వదిలేసి నెల్లూరు రూరల్ పనే చూస్తున్నారని, తాటి వెంకటేశ్వర్లును అరెస్టు చేశారని, పోలీసు స్టేషన్‌కి వెళితే అక్కడ వెంకటేశ్వర్లు లేడని, డీఎస్పీకి ఫోన్ చేస్తే, 24 గంటల్లో కోర్టులో హాజరుపరిస్తామని చెప్పారని అన్నారు. అయితే కాసేపట్లోనే జావీద్ని, మన్నేపల్లి రఘుని అరెస్టు చేశారని, షాడో సీఎం సజ్జల చెప్పినట్లు పోలీసులు పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముగ్గురిని దుర్మార్గంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకు వెళ్లకుండా హైవేల్లో తిప్పారని, వారిని మానసికంగా ఇబ్బంది పెట్టాలని సాయంత్రం 6 నుంచి 11 గంటల వరకు అనేక పోలీసు స్టేషన్లకు తిప్పారని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. 'మీ వేధింపులకు నా వెనుక నడిచే నాయకులు, కార్యకర్తలు లెక్క చేయరు. ఆఖరికి నా డ్రైవర్లు కూడా లెక్క చేయరు. నీకు ఇవి కొత్త... నాకు కాదు. సజ్జల రామకృష్ణా రెడ్డి నా పేరును కూడా ఈ కేసులో చేర్చారు. నాతో సహా 11 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. నేను రూరల్ నియోజక వర్గంలోనే ఉంటాను. నన్ను కూడా అరెస్టు చేసి తుపాకులతో తిప్పుతూ బెదిరించుకో. నన్ను అడ్డుకోవడం నీతరం కాదు. గుర్తు పెట్టుకో. నా వెంట నడిచే వారిపై ప్రతాపం ఎందుకు. దమ్ముంటే నా మీద నీ ప్రతాపం చూపించు' అని సవాలు విసిరారు.

దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు... ముగ్గురి మృతి

ఏలూరు జిల్లా పూళ్ల వద్ద దుర్ఘటన

విశాలాంధ్ర-భీమడోలు: రోడ్డు మార్జిన్‌లో ద్విచక్ర వాహనాలపై ఆగి ఉన్న వారిపై ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాద ఘటన ఏలూరు జిల్లా పూళ్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం మేరకు భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన వీరాస్వామి, మహేంద్ర, ఫణీంద్ర, శ్రీను రెండు ద్విచక్ర వాహనాలపై పూళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లో ఆగారు. అదే సమయంలో చింతలపూడి నుంచి భీమడోలు మీదుగా భీమవరం ప్రయాణించే భీమవరానికి చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్నవారిపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వీరస్వామి, మహేంద్ర ఘటనాస్థలిలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన ఫణీంద్ర, శ్రీనును భీమడోలు 108లో ఏలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో తీవ్రంగా గాయపడిన ఫణీంద్ర మృతి చెందాడు. మరొక క్షతగాత్రుడు గండికోట శ్రీనును జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి ఏలూరుకు తరలించారు. శ్రీను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోడ్డు ప్రమాద ఘటనతో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ కురెళ్లగూడెం గ్రామస్తులు ఘటనాస్థలి సమీపంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ చావా సురేష్, తహసీల్దార్ షంషుద్దీన్ బాధిత కుటుంబాలతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు మృతి



విశాలాంధ్ర-భీమవరం/ఉండి/కాళ్ల: ఉండి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, క్షత్రియ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సర్రాజు మృతితో ఆయన స్వగ్రామం కాళ్ల మండలం జక్కరం విషాదంలో మునిగిపోయింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన సర్రాజు ఉండి నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఒకే ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన మొట్టమొదటి నాయకుడు. ఆయన కోపల్లి సొసైటీ బ్యాంకు అధ్యక్షులుగా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా తనదైన శైలిలో ప్రజలతో మమేకం అయ్యారు.

నివాళి అర్పించిన సీఎం జగన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శనివారం భీమవరంలోని పాతపాటి సర్రాజు నివాసంలో ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు. అనంతరం సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ముఖ్యమంత్రి వెంట శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దాడిశెట్టి రాజా, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు, భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్, డీఐజీ పాలరాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, ఎస్పీ రవి ప్రకాష్, ఎమ్మెల్యేలు వాసు బాబు, మంతెన రామరాజు, దూలం నాగేశ్వరరావు, పేర్ని నాని తదితరులు సర్రాజు భౌతికకాయానికి నివాళి అర్పించారు.

ఏప్రిల్ 30న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 30న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలను నిర్వహించనున్నట్లు రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి వెల్లడించారు. కంటోన్మెంట్ పరిధిలో ఎనిమిది వార్డులు ఉన్నాయి. సికింద్రాబాద్ సహా మొత్తం 57 కంటోన్మెంట్ బోర్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాపై బోర్డు అధికార యంత్రాంగం కసరత్తు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తున్నది. 2015లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 10న పాలకవర్గం కొలువుదీరింది. 2020 ఫిబ్రవరి 10 నాటికి పాలకవర్గం గడువు తీరింది. అనంతరం కేంద్రం నామినేటెడ్ సభ్యుడిని నియమించింది. బోర్డుకు ఎన్నికలు నిర్వహించాలని పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీనిపై స్పందించాలని న్యాయస్థానాలు కూడా కంటోన్మెంట్ బోర్డును ఆదేశిస్తూ వస్తుంది. ఈ క్రమంలోనే కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసేందుకు గానూ విధి విధానాలపై కొన్నిరోజుల కిందట కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఐవోసీ, గంగవరం పోర్టుతో చేసుకున్న

ఒప్పందాన్ని రద్దు చేయాలి

సీపీఎం శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఎల్‌పీజీ గ్యాస్ దిగుమతుల కోసం అదానీ నిర్వహణలో ఉన్న గంగవరం పోర్టుతో చేసుకున్న ఒప్పందంలో ఆర్థిక అక్రమాలు చోటు చేసుకున్నందున కేంద్ర ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ ప్రకటన ఇలావుంది. ఇప్పటి వరకు ఐవోసీ ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ పోర్టు నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ఇప్పుడు దాన్ని కాదని ఇటీవలే అదానీ చేతిలోకి వెళ్లిన గంగవరం పోర్టుతో కనీసం టెండర్లుకూడా పిలవకుండా ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంలో ఎల్‌పీజీ దిగుమతి చేసుకున్నా, చేసుకోకపోయినా డబ్బులు చెల్లించాలన్న (టేక్ ఆర్ పే) నిబంధన ఉన్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్‌జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్ఎల్) తన ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా స్పష్టం చేసింది. అయినా తాము అటువంటి నిబంధనలు అంగీకరించలేదని, ఈ ఒప్పందానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఐవోసీ బుకాయిస్తున్నది. డ్యామేజీ ఛార్జీలు తప్పుతాయని, మెరుగైన సౌకర్యాలు అని సాకులు చెబుతోంది. ఈ కాంట్రాక్టు చేసుకోవడంలో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆధారాలతో సహా చెబుతున్నా మోదీ ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బ తీసి ప్రజాధనాన్ని అదానీకి కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం అర్రులు చాస్తోంది. ఒకవైపు అదానీ అవినీతిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నా.. మరో వైపు అదానీ కొమ్ము కాయడానికి నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నది. ఇకనైనా మోదీ ప్రభుత్వం ఈ అక్రమ ఒప్పందాన్ని రద్దు చేసి, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

అనపర్తిలో రోడ్డుపై బైఠాయించిన పోలీసులపై చర్య తీసుకోవాలి

చంద్రబాబు పర్యటన సందర్భంగా సభకు ముందస్తు అనుమతి ఇచ్చి కూడా పోలీసులు చట్ట విరుద్ధంగా రోడ్డుపై వారే బైఠాయించడం, ట్రాఫిక్‌ని ఆటంకపరచడం చట్ట విరోధమని శ్రీనివాసరావు అన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం నేరమనీ, ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి తుంటరి పనులు మానుకొని ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని రాజకీయ పార్టీలు స్వేచ్ఛగా సభలు జరుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పోలీసు శాఖను కోరారు.

గోదావరిలో ముగ్గురు యువకుల దుర్మరణం

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం : మహాశివరాత్రి సందర్భంగా శనివారం గోదావరిలో స్నానం చేస్తున్న ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. గాలింపు అనంతరం వారి మృతదేహాలు లభించాయి. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు పట్టిసీమ ఉత్సవాల్లో పాల్గొనడానికి వెళ్లారు. వారంతా అక్కడ గోదావరిలో స్నానానికి దిగిన సమయంలో ముగ్గురు గల్లంతయ్యారు. సహచరులు కేకలు వేయడంతో స్థానికులు, గజఈతగాళ్లు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో ఓలేటి అరవింద్ (20), ఎస్.కె.లుక్మన్ (19), పెద్దిరెడ్డి రాంప్రసాద్ (18) ఉన్నారు. గోదావరిలో ముగ్గురు యువకుల మృతి ఘటనపై రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే వైసీపీ నాయకులను అప్రమత్తం చేసి, సంఘటనా స్థలానికి పంపించారు. కోరుకొండ జడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, కొండపల్లి దుర్గారావు సంఘటనా స్థలానికి వెళ్లి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతులు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రాజా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దళితుల నిధులు వారికే వాడాలి

కరవది సుబ్బారావు

విశాలాంధ్ర- తిరుపతి: దళిత, గిరిజనులకు కేటాయించిన నిధులను వారికే వినియోగించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా డీహెచ్‌పీఎస్ ఆఫీసు బేరర్ల సమావేశం ఇక్కడి గంధంనేని శివయ్య భవన్ లో, బి. నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరువది సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ నిధులను పక్కదారి పట్టించి నవరత్నాల పేరుతో వేరే పథకాలకు వెచ్చించటం తగదన్నారు. జిల్లాలో దళిత గిరిజన జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు, సర్పంచ్ లకు, అవమానాలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గూడూరు నియోజక వర్గం, చిలుకూరు మండలం, జడ్పీటీసీ, మన్నెం శీనయ్య కుర్చీపై అగ్రవర్ణలకు చెందిన నాయకులు మూత్రం పోయడం అమానుషం మన్నారు. రాష్ట్రంలోని దళిత గిరిజనులకు సంబంధించి రిజర్వేషన్లలో గెలిచిన ప్రజా ప్రతినిధులకు చెప్పుకోలేని విధంగా అవమానాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత గిరిజన అభివృద్ధి కోసం ఉన్న 27 పథకాలను రద్దు చేసి నిధులను దారి మళ్లించడం సరైంది కాదన్నారు, ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య మాట్లాడుతు, తిరుపతి జిల్లాలో దళితుల అభ్యున్నతి కోసం కృషిచేస్తామని చెప్పిన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు దళిత, గిరిజన అభివృద్ధి కోసం ఏమాత్రం కృషి చేయడం లేదన్నారు. అధికారుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ బలరాం, జగన్నాథం, ఎం తిరుమల, వరగంటి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి ఘటనలో

చంద్రబాబుపై కేసు

వెయ్యి మంది టీడీపీ కార్యకర్తలపై కూడా

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం: అనపర్తి ఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చంద్రబాబు సహా వెయ్యి మంది పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో శుక్రవారం చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. పోలీసుల అడ్డంకులు అధిగమించి చంద్రబాబు కాలినడకన అనపర్తి చేరుకున్నారు. దీంతో చంద్రబాబు ఏ1గా, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జవహర్ ఏ3గా బిక్కవోలు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏ4గా స్వామినాయుడు, ఏ5గా చినరాజప్ప, ఏ6గా మాజీ ఎమ్మెల్యే కొండబాబు, ఏ7 జ్యోతుల నవీన్, ఏ8, ఏ9గా మాజీ ఎమ్మెల్యేలు అయితా బత్తుల ఆనందరావు, గొల్లపల్లి సూర్యారావుపై కేసులు నమోదయ్యాయి. డీఎస్పీ భక్తవత్సలం ఫిర్యాదు మేరకు 143, 353, 149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనపర్తి, బిక్కవోలు పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 3 ఎఫ్ఐఆర్‌లు, అనపర్తిలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, జవహర్ సహా అనేక మంది తెలుగుదేశం నేతలపై 143, 353, 332, 149 సెక్షన్ల కింద కేసులు నమోదయినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అనపర్తి పోలీసు స్టేషన్ పరిధిలో మరికొందరు టీడీపీ కార్యకర్తలపై 188, 506, 34 సెక్షన్ల కింద మరో కేసు నమోదయింది.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి భట్టు దేవానందం దంపతులు శనివారం ఉదయం సందర్శించారు. ముందుగా ఏపీ టూరిజం అతిథి గృహంలో హైకోర్టు జడ్జికి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, పెనుకొండ ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ తిప్పే నాయక్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు శ్రీనివాసకుమార్, లక్ష్మీనరసింహాశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి భట్టు దేవానందం ఆలయంలో కొలువైన దుర్గాదేవి, వీరభద్రస్వాములకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లా కార్యదర్శి (లీగల్ అఫైర్స్ అండ్ జస్టిస్) జి.సత్యప్రభాకర్ రావు కూడా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయం విశిష్టతను గురించి తెలుసుకున్నారు. అనంతరం జడ్జిలను స్థానిక అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు సత్కరించారు. వీరివెంట జిల్లా జడ్జి శ్రీనివాసులుతో పాటు న్యాయమూర్తులు శైలజ, రాజ్యలక్ష్మి, వందన, సబ్ జడ్జి శ్రీధర్, డీఎస్పీ యశ్వంత్, రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు మునీర్అహమ్మద్, శ్రీనివాసులు, తహసీల్దార్ బాబు ఉన్నారు.

సంపాదకీయం

కొత్త రూపులో ఫిరాయింపులు

మహారాష్ట్రలో రెండు శివసేన వర్గాలలో ఏది అసలైన శివసేనో ఎన్నికల కమిషన్ శుక్రవారం తేల్చేసింది. ముఖ్యమంత్రి షిండే వర్గమే అసలైన శివసేన అని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఇందులో ఆశ్చర్య పడవలసింది ఏమీ లేదు. ఎందుకంటే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఎన్నికల కమిషన్ మోదీ సర్కారుకు పరిచారికగా మారిపోయింది. శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రేను గద్దె దించి ఏక్‌నాథ్ షిండే బీజేపీ సహాయంతో అధికారం చేపట్టినప్పుడే నిజానికి ఉద్ధవ్ ఆట కట్టయింది. అసలైన రాజకీయ పార్టీ ఏదో నిర్ణయించడానికి రెండు పార్టీల్లో ఆధిపత్యం ఎవరిదో తేల్చడం ఒకటైతే చట్టసభల్లో ఆధిపత్యం ఏ వర్గానిది అన్నది మరో కొలమానం. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే పార్టీపై ఆధిపత్యం అన్న అంశాన్ని పట్టించుకోకుండానే ఎన్నికల కమిషన్ చట్ట సభ సభ్యుల సంఖ్యాబలం ఆధారంగా అసలైన శివసేన షిండే వర్గానిదేనని, విల్లంబుల ఎన్నికల చిహ్నం కూడా ఆ వర్గానికే చెందుతుందని తీర్పు చేప్పేసింది. షిండే వర్గంలో 40 మంది శాసన సభ్యులు ఉన్నారు కనక, లోక సభలోని 19 మందిలో 13 మంది ఆయన వర్గంలో ఉన్నారు కనక వారికి పడ్డ ఓట్ల ఆధారంగా ఎన్నికల కమిషన్ అసలైన శివసేన వర్గం ఏదో తేల్చేసింది. ఈ విధానం సరైందో కాదో సుప్రీంకోర్టే స్పష్టం చేయవలసి ఉంటుంది. సుప్రీంకోర్టులో ఈ అంశం విచారణలో ఉండగానే ఎన్నికల కమిషన్ నిర్ణయం ప్రకటించడం విచిత్రంగానే ఉంది. పాక్షిక కొలమానాల ఆధారంగా ఎన్నికల కమిషన్ అసలు శివసేన ఏదో తేల్చడంలో మతలబు లేకపోలేదు. షిండే వర్గంలో 40 మంది శాసన సభ్యులు ఉన్నారు కనక అది పార్టీని చీల్చడం కాదనీ, కేవలం శాసనసభా పక్షం నాయకుడు మారిపోయాడని షిండే ఎన్నికల కమిషన్ ముందు వాదించారు. ఎన్నికల కమిషన్ ఈ వాదనకు తలూపింది. పార్టీ నాయకత్వం ఎవరి చేతిలో ఉందో ఎన్నికల కమిషన్ పట్టించుకోనే లేదు. ఉద్ధవ్ ఠాక్రే వర్గంలో 15 మంది శాసనసభ్యులు, 12 మంది శాసన మండలి సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు మాత్రమే మిగిలారు. తమ వర్గమే అసలైన శివసేన అని ఎన్నికల కమిషన్ నిర్ధారించడం ప్రజాస్వామ్యానికి విజయం అనీ, తనకు మద్దతిచ్చిన ఎమ్మెల్యేల, ఎంపీల, పార్టీ కార్యకర్తల విజయం అని షిండే ప్రకటించారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని మరో వర్గం నాయకుడైన ఉద్ధవ్ ఠాక్రే అంటున్నారు. షిండే వర్గం తమ ఎన్నికల చిహ్నమైన విల్లంబులను దొంగతనంగా కాజేసిందని ఉద్ధవ్ ఠాక్రే వాదిస్తున్నారు. ఈ దొంగతనాన్ని ప్రజలు సహించరని కూడా ఆయన అంటున్నారు. పోరాటం ఆపకూడదని ఆయన తన వర్గం కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అయితే తన వర్గంలో మిగిలింది తక్కువ మంది శాసనసభ్యులేనని, లోకసభలో ఎవరూ మిగలలేదని ఉద్ధవ్ ఠాక్రే గ్రహించకపోవడం వాస్తవాన్ని నిరాకరించడమే. ఎన్నికల కమిషన్ శివసేన పార్టీ నిబంధనావళి మూలాలనే ప్రశ్నించింది. దీనితో పార్టీ నిబంధనావళే తమ వర్గాన్ని ఆదుకుంటుందన్న ఉద్ధవ్ విశ్వాసానికి గండి కొట్టినట్టయింది. శివసేన నిబంధనావళిని 2018లో సవరించారు. కాని ఆ విషయాన్ని రికార్డులలో చేర్చలేదు. అసలు ఈ సవరణలే ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నాయని ఎన్నికల కమిషన్ వ్యాఖ్యానించింది. ఎన్నికల కమిషన్ రికార్డులలో ఉన్న 1999 నాటి నిబంధన ఆధారంగానే ఆ కమిషన్ తీర్పు చెప్పింది.

ఎన్నికల కమిషన్ నిర్ణయం ఏక్‌నాథ్ షిండే వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ ఆ వర్గాన్ని అసలైన శివసేన అని ప్రజలు ఆమోదిస్తారా లేదా అన్న విషయం తేలవలసి ఉంది. ఉద్ధవ్ ఠాక్రే సుప్రీంకోర్టుకు వెళ్తానంటున్నారు కనక అసలైన శివసేన ఏదన్న విషయం ఎన్నికల కమిషన్ నిర్ణయంవల్లే తేలుతుందా లేక సుప్రీంకోర్టులో తేలుతుందా, ఇవన్నీ జరిగినా షిండే వర్గాన్ని అసలైన శివసేనగా జనం భావిస్తారా అన్నది ప్రస్తుతానికి జవాబులేని ప్రశ్నే. శివసేన వారసత్వ రాజకీయాలు అనుసరించే పార్టీ అనడంలో సందేహం అక్కర్లేదు. బాలసాహెబ్ ఠాక్రే వారసుణ్ని గద్దె దించి అధికారం సంపాదించిన షిండే బాలాసాహెబ్ వారసత్వం కూడా తనదేనని నిరూపించుకోవడానికి బాగానే కష్టపడవలసి ఉంటుంది. కానీ ఎన్నికల కమిషన్ నిర్ధారణ మహారాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ప్రధానమైన అంశం. శివసేన ఐక్యంగా ఉన్నప్పుడు అధికారంలోకి రావడంకోసం ఉద్ధవ్ ఠాక్రే సైద్ధాంతికంగా ఎలాంటి పొంతనాలేని శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.), కాంగ్రెస్‌తో కలిసి మహావికాస్ అగాధీ ఏర్పాటు చేశారు. పార్టీని చీల్చినప్పుడు ఏక్‌నాథ్ షిండే ఎన్.సి.పి., కాంగ్రెస్ తో కలిసి ఫ్రంట్ కట్టడం శివసేన ఇంతవరకు అనుసరించిన సిద్ధాంత ప్రాతిపదికకు విరుద్ధం అని ఆరోపించారు.

శివసేన లేదా బాలా సాహెబ్ ఠాక్రే అనుసరించిన తీవ్ర హిందుత్వ విధానం ప్రకారం అయితే భారతీయ జనతా పార్టీతోనే పొంతన కుదురుతుందని షిండే అన్నారు. సైద్ధాంతికంగా చూస్తే ఇది సవ్యమైన వాదనగానే కనిపిస్తుంది. ముఖ్యమంత్రి పదవిమీద ఆశలు పెంచుకోనప్పుడు ఆయనకు ఈ వైపరీత్యం గుర్తుకే రాలేదు. ఇందులో షిండే అధికార వ్యామోహం, అవకాశవాద రాజకీయాలే ప్రధానపాత్ర పోషించాయి. శాసనసభలో బీజేపీనే అతి పెద్ద రాజకీయ పక్షం అయినప్పటికీ షిండే ఆసరాతో మళ్లీ అధికారంలోకి రావడానికి కమల దళం షిండే వెనక ఉండి కథంతా నడిపించింది. నిజానికి ఈ నాటకంలో బీజేపీనే అసలు సూత్రధారి. స్వయంగా అధికారం సంపాదించడం, అది వీలుకానప్పుడు డబ్బు సంచులు కుమ్మరించి ఎమ్మెల్యేలను కొనడం, లేదా పార్టీలను చీల్చడం మోదీ హయాంలోని బీజేపీ అనుసరిస్తున్న వ్యూహం. మహారాష్ట్రలో కూడా అదే పని చేసింది. ఈ నాటకంలో షిండే బీజేపీకి బాగా తోడ్పడ్డారు. మరోవేపు మహా వికాస్ అగాధీ ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా సైద్ధాంతిక నిబద్ధత కనబరిచిన దాఖలాలేమీ లేవు. ఆయనకూ అధికారమే పరమావధి అయింది. పోనీ ఉద్ధవ్ ఠాక్రే మతతత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పి సెక్యులర్‌వాదిగా మారిపోయారా అంటే అదీలేదు.

ఇప్పుడు ఉద్ధవ్ చిక్కుకున్న పరిస్థితి ఆయనను సైద్ధాంతికంగా ఆలోచించే అవకాశమే ఇవ్వడం లేదు. బాలాసాహెబ్ ఠాక్రే వారసుడిని కనక శివసేన తనదేనని నిరూపించుకోవడానికే ఆయన సమయం అంతా వృథా అవుతోంది. పార్టీ ఫిరాయింపులు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. ప్రజలతీర్పును ఒకసారి ఎన్నికైనవారు అంగట్లో అమ్మేస్తున్నారు. ఆ తీర్పుకు ఎలాంటి విలువాలేదు. ఈ మొత్తం వ్యవహారంలో బలయ్యేది ప్రజాస్వామ్య ప్రక్రియ. మన రాజకీయ పార్టీలలో లోపించిందల్లా అంతర్గత ప్రజాస్వామ్యమే. మరి రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య బద్ధంగా నడుస్తాయని ఎలా ఆశించగలం!

అశాస్త్రీయ సాగు హానికరం

ప్రపంచవ్యాప్తంగా 67 శాతం ప్రజలు వ్యవసాయరంగం పైననే ఆధారపడి ఉన్నారు. భూమండలంపై నేలల్లో 11 శాతం వ్యవసాయానికి, 26 శాతం జంతు నివాసాలకు వినియోగ పడుతున్నది. ప్రపంచ దేశాల్లో అత్యధిక వ్యవసాయ ఉత్పత్తులు ఉన్న 10 దేశాల్లో చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, రష్యా, ఫ్రాన్స్, మెక్సికో, జపాన్, జర్మనీ, టర్కీలకు పేరుంది. భారత్‌లో 58 శాతం ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉంటూ, 18 శాతం జిడిపీకి (60 శాతం జిడిపీకి వ్యవసాయ ఆధార రంగాలు) కారణం అవుతున్నారు. 1960 కి పూర్వం భారతదేశంలో ఆహార పదార్థాల కొరత విపరీతంగా వెంటాడేది. గత ఆరు దశాబ్దాల్లో హరిత విప్లవం, పారిశ్రామిక ప్రగతి వల్ల దేశంలో ఆహార పదార్థాల ఉత్పత్తులు అనేక రెట్లు పెరిగి మిగులు స్థాయికి చేరడం చూస్తున్నాం.

దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడానికి ఆహార ఉత్పత్తులు పెంచడం ఒక్కటే మార్గం కాకూడదని, పోషకాహార లభ్యతకు అధిక ప్రాధాన్యతలు ఇవ్వాలి. సంప్రదాయ సాగు పద్ధతులు మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని ఉరుగ్వే అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. అక్కడ వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉరుగ్వే జనాభా 3.3 మిలియన్ల ఉండగా, 12 మిలియన్ల ఆవుల సంపద ఉంది. దీనితో పాలు, పెరుగు, నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల నిల్వలు పెరిగి పెద్ద ఎత్తున ఎగుమతులు చేస్తున్నది. పశుసంపద పెరిగినపుడు జంతు వ్యర్థాలలో సాగు నేల నాణ్యత కూడా పెరుగుతుంది.

గతంలో శ్రీలంక తీవ్ర ఆహార పదార్థాల కొరతను ఎదుర్కొన్నది. రసాయన, కృత్రిమ ఎరువుల వినియోగంతో ఆహార పదార్థాల ఉత్పత్తి పెరగడం జరిగింది. అతిగా రసాయన ఎరువుల వినియోగంతో దీర్ఘకాలిక దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి వస్తుంది. రసాయనాల హానిని గమనించిన శ్రీలంక ప్రభుత్వం దశల వారీగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే ప్రయత్నాలు చేసింది. రసాయన ఎరువుల స్థానంలో ఆర్గానిక్ సాగు పద్ధతుల్ని అమలు చేయడం ప్రారంభించారు. ఆహార పదార్థాల దిగుబడులు కూడా పడిపోయి మరోసారి ఆహార కొరత, ద్రవ్యోల్బణాలకు దారి తీసింది. దీని ఫలితంగా ఒక కిలో బియ్యం ధర రూ.115/-, గోధుమలు రూ.100/-కు చేరడంతో పాటు యల్‌పిజి సిలిండర్ ధర రూ.2,500/- వరకు పెరిగింది. ఈ దుష్పరిణామాలతో పాటు కోవిడ్-19 కల్లోలంతో శ్రీలంకలో పర్యాటక పరిశ్రమ పడిపోయి, ఆదాయ మార్గాలు తగ్గి, విదేశీ నిలువలు క్షీణించాయి. ఇవి ఇతర దేశాలకు గుణపాఠం కావాలి.

పాకిస్థాన్‌లో ఏర్పడిన ఆహార సంక్షోభంలో గోధుమలు, చక్కెర వంటి పదార్థాలను తక్కువగా వాడుకోవాలని మంత్రులే ప్రజలను కోరే దుస్థితి వచ్చింది. పాకిస్థాన్‌లో పోషకాహారలోపం, ఆహార పదార్థాల తీవ్ర కొరతలతో ఆకలి చావులను నిస్సహాయంగా చూడాల్సి వస్తున్నది. ఈ చేదు అనుభవాలు ఇతర దేశాలకు కనువిప్పు కావాలి. ప్రపంచ పాస్ఫరస్ నిల్వల్లో దాదాపు 75 శాతం మొరాకోలోనే దొరుకుతోంది. రసాయన ఎరువుల తయారీలో పాస్ఫరస్ వినియోగం అధికంగా ఉంటుంది. మొరాకోలో రసాయన ఎరువుల వినియోగం అపరిమితంగా ఉంటుంది. పాస్ఫరస్ అధిక నిల్వలున్న మొరాకో దేశం రసాయన ఎరువుల తయారీని తగ్గించి, పాస్ఫరస్ నిల్వలను అధిక ధరలకు ఎగుమతి చేసుకునే సదాలోచనలు చేయాలి. రసాయన ఎరువులు, ఆర్గానిక్ సాగు విధానాలతో సమతుల్యత సాధించి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకుంటూ, సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి.

డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, 9949700037

పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్న ప్రభుత్వాలు

డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఇప్పటి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాల మధ్య తేడా గమనిస్తే ఆశ్చర్యపోతారు. నెహ్రూ పాలనలో ముంద్ర కుంభకోణం బైటపడింది. ఈ కేసులో ఆనాటి ఆర్థికమంత్రి టీటీ కృష్ణమాచారి రాజీనామా చేశారు. ఇప్పుడు మోదీ సన్నిహితుడు గౌతమ్ అదానీ గ్రూపుపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై మోదీ కనీసం మాట్లాడటంలేదు. కలకత్తాకు చెందిన హరిదాస్ ముంద్ర పరిశ్రమల్లో కొత్తగా ఏర్పాటైన ఎల్ఐసీ 1.26కోట్లకు అధిక ధరలు చెల్లించి వాటాల కొనుగోలు ద్వారా పెట్టుబడులు పెట్టింది. ఆర్థిక కష్టాల్లోఉన్న ముంద్ర పరిశ్రమలలో ఎల్ఐసీ అధిక ధరలకు వాటాలుకొని సహాయపడిందన్న ఆరోపణలు రుజువయ్యాక కృష్ణమాచారి రాజీనామా చేశారు. అదానీ గ్రూపు లెక్కలు చూపించడంలోనూ షేర్‌మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం లోనూ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలు వచ్చినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. మోదీ ప్రభుత్వం పార్లమెంటులో సైతం ఈ వ్యవహారంపై కనీసం మాట్లాడటంలేదు. నెహ్రూ ప్రభుత్వానికి, మోదీ ప్రభుత్వానికి మధ్యగల తేడాను గమనించాలి. గత ప్రభుత్వాలలో జరిగిన తప్పులను ఇప్పుడు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది. ఆనాడు ప్రైవేటు బీమా రంగంలో జరుగుతున్న అక్రమాలను, అవినీతిని బైటపెడుతూ 1955 లోకసభలో ప్రముఖ పార్లమెంటు సభ్యుడు ఫిరోజ్ గాంధీ బైటపెట్టాడు. ఫిరోజ్ గాంధీ పరిశోధనాత్మక జర్నలిస్టు కూడా. ఆయన రామకృష్ణ దాల్మియా (దాల్మియా జైన్‌గ్రూపు) చేసిన అవినీతి ఆరోపణలు కూడా రుజువుకావడంతో దోషి రెండేళ్లు జైలుశిక్ష అనుభవించాడు. బీమా రంగంలో అవినీతిని సహించరాదని నెహ్రూ ప్రభుత్వం 250 ప్రైవేటు బీమా కంపెనీలను జాతీయంచేసి ఎల్ఐసీ ఏర్పాటు చట్టాన్ని పార్లమెంటులో ఆమోదింపచేశారు.

1957జూన్‌లో ఆరు హరిదాస్ ముంద్రా పరిశ్రమల్లో ఎల్ఐసీ కోటి రూపాయలు పెట్టుబడి పెట్టింది. అది అప్పటికీ తక్కువ మొత్తం అయి ఉండవచ్చు. ఇప్పుడు ఎల్ఐసీ భారీపెట్టుబడులు పెట్టింది. పెట్టుబడులు పెట్టే ముందు ఎల్ఐసీ పెట్టుబడుల కమిటీలను సైతం సంప్రదించలేదు. సంస్థాగత అవినీతిని ఫిరోజ్‌గాంధీ ఎంతమాత్రం సహించేవాడుకాదు. అందుకనే అవినీతిపరులపైన కొరడా ఝుళిపించాడు. నెహ్రూ స్వయాన ఆయన మామ అయినప్పటికీ ఫిరోజ్ వెనుకాడకుండా కుంభకోణాలను బైటపెట్టి అందుకు



కారణమైనవారిని శిక్షింపచేశాడు. పైన తెలిపిన కుంభకోణాలపై నెహ్రూ ప్రభుత్వం ఎమ్‌సీ చాగ్లా కమిషన్‌ను వేశారు. కేవలం 24రోజుల్లో కమిషన్ తనదర్యాప్తు ముగించి నివేదిక అందించింది. కమిషన్ అత్యంత పారదర్శకంగా విచారణ జరిపింది. ముంద్రా పరిశ్రమలను గట్టెక్కించడంలో కృష్ణమాచారి సహకరించాలన్న ఆరోపణలు రుజువు కావడంతో ఆయన రాజీనామా చేశారు. 1990లలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా కుదిపేసిన ఆర్థిక కుంభకోణాన్ని సీపీఐ నాయకుడు గురుదాస్ దాస్ గుప్తా బైటపెట్టాడు. స్టాక్‌మార్కెట్‌లో జరుగుతున్న అనేకఅక్రమాలను ఆయన వెల్లడించాడు. తీవ్రఆర్థిక అక్రమాలకు పాల్పడిన హర్షద్ మెహతా కేసు దేశప్రజలను విభ్రాంతికి లోనుచేసింది. స్టాక్ బ్రోకర్ హర్షద్‌మెహతాపై అప్పటి పీవీ నరసింహారావు ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటుచేసింది. దేశంలో జరిగిన అతిపెద్ద ఆర్థిక మోసాన్ని దర్యాప్తు కమిటీ బైటపెట్టింది. ఈ కేసులో ఆనాటి వాణిజ్యశాఖ సహాయమంత్రి పి.చిదంబరం రాజీనామా చేశారు. హర్షద్ మెహతా స్టార్ ఎక్స్‌చేంజి కుంభకోణానికి సంబంధించిన దాదాపు అనేక డజన్ల కంపెనీలలో ఒకదానిలో చిదంబరం పెట్టుబడులు పెట్టారు. అనేక సంస్థలు, వ్యక్తులు అధికార కేంద్రాలకు సన్నిహితంగా ఉన్నారని వీటిపట్ల నిర్లక్ష్యం ఉన్నదని ఆనాటి జేపీసీ వెల్లడించింది. ఈ కుంభకోణంపై దర్యాప్తు అంతిమంగా దేశంలోని మార్కెట్ నియమనిబంధనలను పూర్తిగా సరిచేసేందుకు దోహదపడింది. జవాబుదారీ యంత్రాంగాలను ఏర్పాటు చేశారు.

అదానీ గ్రూపు అకృత్యాలు వెలుగుచూసిన వ్యవహారంలో ఒక అంశం స్పష్టంగా ఉంది. ఇందులో పారదర్శకత, జవాబుదారీతనం ఎక్కడా కనిపించదు. అదానీ గ్రూపుకు చెందిన లిస్టెడ్ కంపెనీలన్నింటికీ అధిక ప్రాధాన్యత, అధిక విలువకు వాటాల విక్రయం లాంటి అక్రమాలను ఈ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చిన హిండెన్‌బర్గ్ కనుగొన్నది. కనీసం రెండు అదానీ కంపెనీలలో షేర్ల అసలుధరకు, కొనుగోలు ధరకు 800 రెట్లు తేడా ఉన్నదని అనుమతిఉన్న పరిమితులకంటే ఇది చాలా ఎక్కువని హిండెన్‌బర్గ్ బైటపెట్టింది. ఈ వ్యవహారాలన్నింటిపైన సమగ్రంగా దర్యాప్తు చేయవలసిన అవసరం ఎంతైనాఉంది. ఫోర్బ్స్ పత్రిక అంచనాప్రకారం, గౌతమ్ అదానీ గ్రూపు సంపద 2009నాటికి 6.4బిలియన్ డాలర్లు ఉంది. 2014నాటికి ఇది 7.1బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది 2019నాటికి రెట్టింపుకంటే ఎక్కువగా 15.1 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. మోదీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనా కాలాన్ని పూర్తిచేసుకునే నాటికి అదానీ గ్రూపు ఊహించలేని స్థాయికి ఆర్థికంగా పెరిగిపోయింది. ఆ తరువాత అదానీ సొంతగా 124 బిలియన్ డాలర్లకు అమాంతం పెరిగి ప్రపంచంలోనే రెండవ పెద్ద సంపన్నుడిగా వార్తలకెక్కాడు. 2020నాటికి మరో 47 బిలియన్ డాలర్ల సంపద వచ్చి చేరింది. ఎలాంటి అనుభవం లేకపోయినా అనేక విమానాశ్రయాలను, ఆస్ట్రేలియాలో బొగ్గు గనులను, బంగ్లాదేశ్‌లో విద్యుత్తు ప్రాజెక్టు కాంట్రాక్టులను దక్కించుకున్నాడు. అదానీ పేరు సర్వవ్యాప్తమైంది. ఒక వ్యక్తివద్ద అసాధారణమైన సంపద పోగుకావడం నిజంగా ఆందోళన కలిగించే అంశం. అసలు విలువకంటే అధిక విలువగల కంపెనీలుగా మారిన అదానీ కంపెనీలు కేవలం సంస్థాగత, రిటైల్ పెట్టుబడిదారులకేకాక దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరమైన వ్యవహారం. అదానీగ్రూపు రక్షణ విభాగంలాంటి అనేక కీలక రంగాలలో చొరబడటం మరింత ముప్పు కలిగించే విషయం.

ప్రముఖ ఆర్థిక సంస్థలు ఎల్ఐసీ,ఎస్‌బీఐ లాంటివికూడా అదానీ గ్రూపు కారణంగా ఆర్థికంగా నష్టపోయాయి. అయితే ఈ రెండు కూడా వ్యవహారాన్ని తేలికగా తోసిపుచ్చి అదానీకి చెడ్డపేరురాకుండా చూడాలని భావించాయి. ఇవి దేశ ఆర్థిక సమగ్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తుంది. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీ ద్వారా దర్యాప్తు జరిపించాలన్న డిమాండు పూర్తిగా న్యాయమైంది. అసలు వాస్తవం వెలుగుచూడాలి. దర్యాప్తుకు భయపడవలసిన అవసరం ఏముంది? ఆనాడు ముంద్రా కుంభకోణం వ్యవహారంలో ఫిరోజ్‌గాంధీ లోకసభలో చర్చను ప్రారంభిస్తూ ఇంత తీవ్రమైన వ్యవహారాలు వెలుగు చూసినప్పుడు మౌనం కూడా నేరమే అవుతుందని అన్నారు. అసలు ఏమిజరిగిందన్నది తెలుసుకుని జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ అవశ్యం.

జ్ఞానం సంపాదించిన వారంతా బౌద్ధులే!

డాక్టర్ దేవరాజు మహారాజు

"బౌద్ధులు ఏ పుస్తకానికో, వ్యక్తికో బానిసలు కారు. బుద్ధుని అనుసరించడమంటే, తమ ఆలోచనా స్వేచ్ఛను వదులుకోవడం కాదు. స్వేచ్ఛగా బుద్ధుని మార్గంలో ఆలోచించి, జ్ఞాన ప్రపూర్ణులై తాము కూడా బుద్ధులు కావచ్చు. బుద్ధులుకాగల సామర్థ్యం అందరిలోనూ ఉంటుంది. ప్రయత్నించి సాధించాలి!" అని వాట్ ఈజ్ బుద్ధిజమ్ ? గ్రంథంలో నాద మహా థేరో అంటారు.

బుద్ధ వచనంలో గౌతమ బుద్ధుడు బోధించిన దశ శీలాలు ఈ విధంగా ఉన్నాయి. 1.హింసను ఆపండి. ఇతర జీవులకు ప్రాణహాని తలపెట్టకుండా నిగ్రహించుకోండి. 2.మీకు ఎవరూ ఇవ్వనిది, మీకు మీరే తీసుకోకుండా నిగ్రహించుకోండి. 3.స్వచ్ఛతతో, నిజాయితీగా బతకండి. ఎల్లప్పుడూ మెలకువతో మెలగండి. 4.అబద్ధాలు చెప్పకుండా నిగ్రహించుకోండి. 5. సత్యం మాట్లాడండి. అదే నమ్మదగింది. అదే ఆధారపడ దగింది. అనే విషయం రుజువు చేసుకోండి! 6. ఇతరులు గూర్చి చెడు మాట్లాడకుండా, వారిపై దుష్ప్రచారం చేయకుండా నిగ్రహించుకోండి. 7. మైత్రిని ప్రేమించండి. మైత్రి పెంపొందించే మాటలు మాత్రమే మాట్లాడండి. విద్వేషాలు విడనాడండి. విద్వేషాలు రేకెత్తించే మాటలు మాట్లాడకండి. 8.ఇతరుల మనసులు గాయపరిచే దురుసు మాటలు మాట్లాడకండి. 9. వ్యర్థ సంభాషణలు వదిలేయండి. ఖచ్చితమైన, సున్నితమైన, సభ్యమైన మాటలు మాత్రమే ఎన్నుకుని జాగ్రత్తగా మాట్లాడండి.10. అర్థవంతమైన, సవివరమైన పద్ధతిలో మీ వాదనను స్పష్టంగా వివరించండి. -గౌతమ బుద్ధుడు (సుత్త పీటక-దీఘనికయ-బ్రహ్మ జాల సుత్త)

(ఈ దశ శీలాలు ప్రపంచ మానవులందరికోసం చెప్పినవి .అయితే ప్రత్యేకించి మన దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు, వారి బీజేపీ పార్టీ ప్రముఖులూ పాటిస్తే దేశం కాస్త ఊపిరి పీల్చుకునే అవకాశం ఉండేది!)

బుద్ధ-ధమ్మ-సంఘం: ఇవి త్రి రత్నాలు, బౌద్ధులైన వారు విధిగా వీటి శరణు పొందాలి. అందుకే వీటిని 'త్రిశరనాలు' అని కూడా అన్నారు.

1.బుద్ధ లేక బోధి అని అంటే, సుప్రీం నాలెడ్జ్-ట్రీ ఆఫ్ విజ్‌డమ్, అత్యున్నతమైన జ్ఞానం పొందినవాడు గనుకనే గౌతముడు బుద్ధుడయ్యారు. తనకన్నా ముందు ఇంకా చాలా మంది బుద్ధులు ఉన్నారని స్వయంగా బుద్ధుడే చెప్పాడు. బుద్ధుడు వినయశీలిగనక, తన గూర్చి తానుగొప్పగా చెప్పుకోకుండా, తనకంటే ముందే జ్ఞాన సముపార్జన చేసిన వారున్నారని ఆయన చెప్పి ఉంటాడు. బోధిస్థితిని సాధించిన వారందరిలోకి మహావ్యక్తి బుద్ధుడే. అందువల్ల ఈ జగత్తు ఆయన ఒక్కడినే బుద్ధుడిగా గుర్తు పెట్టుకుంది. మానవుల దు:ఖవిముక్తికి దారి చూపినవాడు గనక, ఈ ప్రపంచం దృష్టిలో ఆయనొక్కడే బుద్ధుడయ్యాడు.

2.ధమ్మ అంటే, ప్రకృతి నియమానికే ధమ్మ (ధర్మం) అని అర్థం. ప్రకృతి నియమాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, అది అధర్మం అవుతుంది. తథాగతుడు ఏది ఎలా ఉంటే అలా దాని ప్రకారం నడుచుకునే వాడు అని అర్థం. ప్రకృతి నియమాల ప్రకారం నడుచుకునేవాడు గనక బుద్ధుడి 'తథాగతుడు' అని పేరు. శాక్యవంశానికి చెందినవాడు గనక, ముఖ్యంగా మునిలాగా జీవించినవాడుగనక, ఆయనను 'శాక్యముని' అని కూడా పిలుచుకున్నారు.

3.సంఘం: మనిషి సంఘజీవి. బౌద్ధమార్గాన్ని అనుసరిస్తూ, మనసును నిర్మలంగా ఉంచుకుంటూ, అంకిత భావంతో, నిబద్ధతతో సమాజానికి మేలుచేసే పనులలో నిమగ్నం కావాలి. వ్యక్తిగతంగా తన జీవితానికి ప్రాధాన్యత ఇవ్వకుండా తన బోధనల పట్ల మాత్రమే శ్రద్ధ వహించాలన్నాడు బుద్ధుడు. బోధి స్థితికి చేరాలన్నా నిర్వాణ దశకు చేరాలన్నా ఎవరికి వారు కృషి చేయాల్సిందేనని కూడా చెప్పాడు. జీవితంలో తాను ఆచరించిన అంశాలే బుద్ధుడు ఇతరులకు బోధించాడు. స్వీయపరిశీలనలో తాను తెలుసుకున్న విషయాలు, గ్రహించిన అంశాలు మాత్రమే తన శిష్యులకు, అనుచరులకూ బోధించాడు.దు:ఖం అనే తిమిరం నుండి 'నిబ్బాణం' (నిర్వాణం) అనే వెలుగువైపు నడిచే మార్గాన్ని బుద్ధుడు ప్రబోధించాడు. తను కేవలం దారి చూపగల వాడినేకానీ,మోక్షదాతను కాదన్న వాస్తవాన్ని స్పష్టం చేశాడు.

బుద్ధుణ్ని 'భగవాన్ బుద్ధ' అని కొందరు పిలుస్తుంటారు. మానవ మాత్రుడైనవాణ్ణి. భగవాన్‌అని పిలవడమేమిటీ? అని కొందరికి అనుమానం రావొచ్చు. భగవాన్ అంటే అసలైన అర్థం రాగద్వేషాల్ని, మోహాల్ని భగ్నం చేసుకున్నవాడు అని అర్థం! భగవాన్ అనేది బుద్ధుడికి ఉన్న బిరుదు. వైదిక-బ్రాహ్మణ-హిందూ ధర్మం చెప్పే భగవాన్‌కు, బౌద్ధం చెప్పే భగవాన్‌కు చాలా వ్యత్యాసం ఉంది. ముందుమనం దాన్ని అర్థం చేసుకోవాలి. వైదిక ధర్మం ప్రకారం భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు. ఆదీ అంతం లేనివాడు. ఈ సృష్టి రచన చేసినవాడు. జగద్రక్షుడు. మహిమలు గలవాడు. పాపపుణ్యాలు లెక్కగట్టుకునేవాడు. ఎప్పుడూ ఎక్కడా కనబడనివాడు. మనిషే మెదడులో సృజించబడ్డవాడు. ఇలాఎన్నో అర్థాలున్నాయి! కానీ, బుద్ధుడు అలా కాదు. వాస్తవంగా ఈ ప్రపంచంలో పుట్టిన వ్యక్తి. రాజ్యాన్ని, సర్వసుఖాల్ని త్యజించి, సత్యాన్వేషణకు అడవుల్లో గడిపిన వాడు. ప్రకృతి పరిశీలనలో కొన్ని జీవనసత్యాల్ని గ్రహించినవాడు. తాను గ్రహించిన మానవీయ విలువల్ని, జీవన సత్యాల్ని తన శిష్యులకు, అనుయాయులకు బోధిస్తూ ఈ దేశం నాలుగు చెరగులా తిరిగిన వాడు. వైదికుల భగవంతుడు కల్పితం! బౌద్ధుల భగవాన్ యదార్థం!! రెంటికీ చాలా తేడా ఉంది. ఎవరైతే సాధనచేసి, మానసిక వికారాలు పూర్తిగా తొలగించుకుంటారో వారే 'భగవాన్' అవుతారు. అందుకు విపశ్యన ధ్యానం సాధన చేయాలని బౌద్ధం చెపుతుంది.



భదంత-అంటే భిక్షువు/భిక్కు/భగవాన్ అనే అర్థాలున్నాయి. భంతే భగవంత అనే పదాలకు కూడా అర్థం అదే పెద్దవారినీ, గౌరవనీయులను 'భంతే' అని పిలవాలని, చిన్నవారినీ, సమఉజ్జీలైన స్నేహితుల్ని 'అవుసో' అని పిలవాలని, 'మహా పరినిబ్బాన సూత్రం'లో స్వయంగా బుద్ధుడే చెప్పాడు. భిక్షు సంఘంలోకి బుద్ధుడు ప్రత్యేకించి ఎవరినీ ఆహ్వానించలేదు. బౌద్ధ భిక్షుకావడ మన్నది ఎవరికి వారు తీసుకోవల్సిన నిర్ణయం. శ్రమించకుండా బతుకు వెళ్లదీయడానికి భిక్కు కావద్దనీ, సమాజానికి సేవలు అందించే వారు అయితేనే, భిక్కు సంఘంలో చేరాలనీ ఆయన సూచించాడు. ఎవరో లోకరక్షకుడు ఉన్నాడన్న భ్రమలో యజ్ఞాలూ, యాగాలు చేస్తూ, తమను తాము మోసం చేసుకుంటూ లోకానికి తప్పుదోవ చూపేవాడు బౌద్ధభిక్షువు కాకపోవడమే మంచిదన్నాడు. ప్రశాంత వదనంతో సత్యాన్ని సత్యంగా, కరుణ, ప్రేమ, మైత్రితో ప్రజలకు జ్ఞానం అందించేవారు మాత్రమే బౌద్ధులవుతారనీ చెప్పాడు. నీటిలో పుట్టిపెరిగిన తామరపువ్వు, నీటిలోని మురికి అంటించుకోకుండా పైకి తేలి ఎలా నిలబడుతుందో బౌద్ధులు కూడా అదేవిధంగా లౌకిక ప్రపంచపు మురికిని అంటించుకోకుండా స్వచ్ఛంగా ఉండాలనీ బుద్ధుడు చెప్పాడు. (అంగుత్తర నికాయ11-38) బుద్ధుడుచెప్పిన నైతిక విషయాలు బుద్ధుడి కంటే ముందే మరికొందరు చెప్పి ఉంటారు. కానీ, అంతవరకు ఎవరూచెప్పని అంశం 'శాస్త్రీయతని' జోడించి, బుద్ధుడు సంఘాన్ని నిర్మించాడు. మనుషులలో సోదర సమానత్వ భావనల జ్ఞానాన్ని తొలిసారి మనుషులలో కలిగించిన తాత్వికుడు-బుద్ధుడు. అతీత శక్తులేవీ ఉండవని స్పష్టం చేసిన భౌతికవాది. (శ్రద్ధ, ఏకాగ్రత, సమర్పణ భావనలు గురించి చెప్పిన ఉపాధ్యాయుడు.

జ్ఞానమే పునాదిగా గలది-బౌద్ధం
మానసిక ఉన్నతిని సాధించడం -బౌద్ధం!!

దయ, కరుణ, నిస్వార్థం, సత్ప్రవర్తనల గూర్చి బోధించిన బుద్ధుడు, అహింసా పద్ధతుల్ని, యుద్ధ వ్యతిరేకతని ప్రపంచానికి అందించాడు. ఒక దార్శనికునిగా తాను జీవించిన కాలానికి అతీతంగా ఆలోచించి, శీలాన్ని, ప్రగతిశీల ఆలోచనా ధోరణిని ప్రపంచానికి చాటిచెప్పిన నాగరికుడు. బుద్ధుడిని మించి శాంతిమార్గం చూపిన ప్రపంచ శాంతికాముకుడు మరొకరులేరు. పన్నెండవ శిలాశాసనంపై అశోకుడు ఒక చక్కనిమాట చెక్కించాడు. "ఎవరైతే తాము నమ్మిన ధర్మాన్ని వ్యాప్తిచేయాలని 'ఇతరులను కించపరుస్తూ మాట్లాడు తారో, వారి నిజానికి తమ ధర్మానికే నష్టం కలిగిస్తారు" అని! బౌద్ధ బహుజన చక్రవర్తి అశోకుడు బ్రాహ్మణులకు, జైనులకు, ఆజీవకులకు ఎంతో ఉదారంగా దానధర్మాలు చేశాడు. అశోకుడు గానీ,అతని తర్వాత వచ్చిన 'ఇతర బౌద్ధ చక్రవర్తులుగానీ ఇతర మతాలను, ఇతర ధర్మాలను ద్వేషించలేదు. వాటిని నాశనం చేయాలని ప్రయత్నించలేదు. కానీ, బ్రాహ్మణ పాలకుడు పుష్యమిత్ర శృంగుడు అతని వారసులు బౌద్ధ భిక్షులను చంపించారు. బౌద్ధారామాలను ధ్వంసం చేయించారు. ఆ తర్వాత ఆది శంకరుడు, రామానుజుడు అనే వైదిక మత గురువులు వారి వారి కాలాలలో హిందూ తీవ్రవాదులుగా ప్రవర్తించారు. బౌద్ధ, జైనారామాల్ని హిందూదేవాలయాలుగా మార్చడంలో ఆరితేరారు. బౌద్ధాన్ని నాశనంచేయడంలో వీరూ వీరి అనుచరులు తమనితాము విజయులుగా భావించుకుని ఉంటారు. కానీ, చరిత్రలో దోషులుగా మిగిలిపోయారు. ఆ విషయాలు అలా ఉంచితే, 14అక్టోబరు 1956 అశోక విజయదశమి రోజున ప్రపంచ మేధావి డా.బి.ఆర్.అంబేద్కర్, తన తాడిత, పీడిత సోదరసోదరీ మణుల్ని సుమారు మూడు లక్షల అరవై అయిదువేల మందిని తీసుకుని నాగపూర్‌లో బౌద్ధం స్వీకరించారు. మనుషులుగా గుర్తించని హిందూ మతంపై తిరుగుబాటు చేశారు. తరువాతి తరాలవారికి సైతం, ఒక జీవనవిధానాన్ని చూపించారు!

కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు విజేత,జీవశాస్త్రవేత్త.

అంబులెన్స్‌లోనే ప్రసవం

రైసెన్ : మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలో 24 ఏళ్ల గర్భిణి ఒకరిని ఆసుపత్రికి తీసుకువెళుతుండగా అంబులెన్స్‌లోనే ఆమె ముగ్గురు మగ శిశువులకు జన్మనిచ్చిందని అధికారి ఒకరు శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం పిప్లియా గోలీ గ్రామానికి చెందిన జ్యోతి బాయి అనే గర్భిణీకి నొప్పులు రావడంతో తొలుత ఆమెను గ్రామంలోని గోహర్‌గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే, ఆమె పరిస్థితి క్షీణించడంతో ఆరోగ్య కేంద్రం ఆమెను ప్రభుత్వ 108 అంబులెన్స్ సేవ ద్వారా భోపాల్‌లోని ప్రభుత్వ సుల్తానియా ఆసుపత్రికి పంపినట్లు అధికారి తెలిపారు. అయితే ప్రయాణ సమయంలో ఆమెకు ప్రసవవేదన వచ్చిందని, రాష్ట్ర రాజధానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండిదీప్ సమీపంలో ఆమె ముగ్గురు మగ పిల్లలకు జన్మనిచ్చిందని అంబులెన్స్‌లో ఉన్న మహిళతో పాటు వచ్చిన డాక్టర్ సందీప్ మారన్ చెప్పారు. తల్లిని, ఆమెకు పుట్టిన ముగ్గురు మగపిల్లలను సుల్తానియా ఆసుపత్రికి తరలించామని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని, వైద్యులు పర్యవేక్షిస్తున్నారని డాక్టర్ మారన్ వివరించారు.

కొలీజియం ఓ పరిపూర్ణ వ్యవస్థ : మాజీ సీజేఐ

న్యూఢిల్లీ: దేశంలోని వ్యవస్థల్లోకంటే పరిపూర్ణమైన, కచ్చితత్వంతో పనిచేసేది కొలీజియం వ్యవస్థేనని మాజీ సీజేఐ యూయూ లలిత్ అన్నారు. న్యాయమూర్తులను నియమించేందుకు కొలీజియం అనుసరించే పద్ధతే కచ్చితమైనదిగా తెలిపారు. ఆయన శనివారం న్యాయవ్యవస్థలో నియామకాలు, సంస్కరణల అంశంపై జరిగిన న్యాయ జవాబుదారీ-సంస్కరణలపై అవగాహన కార్యక్రమం (సీజేఏఆర్)లో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ న్యాయస్థానాలకు అర్హులైన న్యాయమూర్తుల పేర్ల సిఫార్సుకు అనుసరించే పద్ధతి కఠినమైందన్నారు. కొలీజియం వ్యవస్థకు మించి పరిపూర్ణమైన వ్యవస్థ, దానికంటే మెరుగైనది మరొకటి లేదని చెప్పారు. అందుకే దాని మనుగడకు హామీనిచ్చేలా కసరత్తు అవసరమన్నారు. జడ్జిల నియామకానికి అనుసరిస్తున్న నమూనా దాదాపు పరిపూర్ణమైందని జస్టిస్ లలిత్ చెప్పారు. ఏదేని పేరు సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు చేరితే దానిని ఆమోదించాలా లేదా అనేది నిర్ణయించేందుకు కచ్చితమైన పద్ధతి ఉంటుందని, ఇది ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. కొలీజయం వ్యవస్థకు ప్రభుత్వానికి కొనసాగుతున్న వివాదంతో జస్టిస్ లలిత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

మద్దతిస్తే సరే... లేకుంటే దాడులే
బీజేపీ తీరుపై తేజస్వి యాదవ్

పాట్నా: దేశంలో బీజేపీ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై ఆర్జేడీ అగ్ర నాయకుడు, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ స్థితిగతులు, వాతావరణం చాలా దారుణంగా ఉన్నాయన్నారు. అధికార బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే.. వారిపై కళంకితులు, అవినీతిపరులంటూ ముద్ర వేస్తున్నారని విమర్శించారు. వారిపై ఐటీ, ఈడీ సోదాలు జరుగుతున్నాయని విమర్శించారు. తప్పుడు ఆరోపణలతో కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా దాడులు చేయించి ప్రతిపక్ష నేతల వ్యక్తిత్వాన్ని హత్య చేస్తున్నారని, అయినా లొంగకపోతే తప్పుడు కేసులతో జైలుకు పంపుతున్నారని తేజస్వి ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీతో కలిసి నడిస్తే మాత్రం వాళ్లు సత్యహరిశ్చంద్రులు అయిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఒక నాయకుడిపై ఎన్ని అవినీతి మరకలు ఉన్నా సరే బీజేపీలో చేరడమో, బీజేపీకి మద్దతు నిలవడమో చేస్తే చాలు పునీతుడైపోతాడని విమర్శించారు. అలాంటి నేతలను బీజేపీ వాషింగ్ మెషిన్‌లో వేసి శుభ్రం చేస్తోదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

కశ్మీర్‌లో శివరాత్రి వేడుకల్లో ముస్లిం దంపతులు

మట్టన్ : జమ్ముకశ్మీర్‌లో మత సామరస్యం వెల్లివిరిసింది. శనివారం మహాశివరాత్రి సందర్భంగా అనంతనాగ్ జిల్లాలోని మార్తాండ్ సూర్య దేవాలయంలో హిందూ దేవుడు శివునికి జలాభిషేకం నిర్వహించిన డజన్ల కొద్దీ భక్తులలో రాజస్థాన్ నుంచి వచ్చిన ఒక ముస్లిం దంపతులు కూడా ఉన్నారు. 'ఇది హిందువులకు (మహాశివరాత్రి), ముస్లింలకు (షాబ్-ఇ-మెరాజ్) శుభ సందర్భం. మేము మహమ్మదీయులు (ముస్లింలు) ఆలయాన్ని సందర్శించలేనట్లు కాదు' అని హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన జోయా ఖాన్ ఇక్కడ పీటీఐకి చెప్పారు. 'ఇది మాకు ప్రార్థనల రోజు. ఈ రోజు శివరాత్రి. వారు ఇక్కడ ఎలా జరుపుకుంటారో చూద్దాం' అని రాజస్థాన్‌కు చెందిన ఫైజాన్ ఖాన్‌ను వివాహం చేసుకున్న జోయా చెప్పారు. 'నేను శివ్‌జీకి నీటిని అందించాను. ఇది దంపతులకు మంచిదని భావిస్తారు. మా అమ్మ కూడా దాని గురించి నాకు చెప్పింది. మేము ముస్లింలమే కానీ మేము ఈ సంప్రదాయాన్ని ఇష్టపడతాము. అందువల్ల మేము దానిని అనుసరిస్తాము' అని ఆమె తెలిపారు. కశ్మీర్‌కు రాకముందు, లోయలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తత ఉందని తాను భావించానని జోయా చెప్పారు. 'మేము ఇక్కడికి రాకముందు, హిందూ-ముస్లిం మతపరమైన ఉద్రిక్తతలు ఉండవచ్చని మేము అనుకున్నాము. కానీ అలాంటిదేమీ లేదు. మతం ఆధారంగా ఎటువంటి వివక్ష లేదు. ప్రజలు దీనిని సందర్శించే వరకు దీని గురించి తెలుసుకోలేరు' అని ఆమె అన్నారు. శ్రీనగర్‌లోని దాల్ గేట్‌లోని శంకరాచార్య ఆలయంలో కూడా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి పూజలో చేరిన భక్తుల్లో రాకేష్ రైనా అనే కాశ్మీరీ పండిట్ కూడా ఉన్నాడు. ఇటీవల టర్కీలో జరిగినట్లుగా విపత్తులు పునరావృతం కాకుండా ఉండేందుకు శివుడు అందరికీ తన ఆశీస్సులు ప్రసాదించాలని మేము ప్రార్థిస్తున్నాము, కోరుకుంటున్నాము' అని రైనా చెప్పాడు. ముంబైకి చెందిన జ్యోతి అనే పర్యాటకురాలు పూజ కోసం చేసిన ఏర్పాట్లను చూసి ముగ్ధురాలయింది. 'మేము ఇక్కడ దర్శనం చేసుకున్నాము. ఇక్కడ నిర్వహణ చాలా బాగుంది' అని చెప్పింది.

జార్జ్ సోరస్ సంపన్న మూర్ఖుడు: జై శంకర్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జ్ సోరస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. గౌతమ్ అదానీ వ్యాపార సామ్రాజ్యంలో కల్లోలం భారత సర్కారుపై మోదీ పట్టును బలహీనపర్చే అవకాశముందన్నారు. దేశంలో ప్రజస్వామ్య పునరుద్ధరణకు అది తలుపులు తెరవొచ్చని అన్నారు. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఘాటుగా స్పందించారు. 'జార్జ్ సోరస్‌కు వయస్సు మళ్లింది. ఆయన ఓ బిలియనీర్... మూర్ఖమైన అభిప్రాయాలు కలిగిన వ్యక్తి. న్యూయార్క్‌లో ఉంటూ ప్రపంచం తన అభిప్రాయాల ఆధారంగా పనిచేయాలని భావిస్తారు. ఇలాంటివారు తమకు అనుకూల కథనాలు రూపొందడంలో పెట్టుబడులు పెడుతుంటారు. వారు తమకు అనుకూల వ్యక్తి అధికారంలోకి వస్తే ఎన్నికలు సక్రమంగా జరిగాయంటారు. లేకపోతే అవకతవకలు జరిగాయంటారు. స్వేచ్ఛా సమాజం అనే నెపంతో ఈ వాదనలు చేస్తుంటారు' అని జైశంకర్ వ్యాఖ్యానించారు. జర్మనీలోని మ్యూనిచ్ భద్రతా సదస్సులో భాగంగా సోరస్ ప్రసంగిస్తూ హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం స్టాక్‌మార్కెట్‌లో అదానీ గ్రూప్ సంస్థలు భారీగా నష్టపోయిన విషయాన్ని ప్రస్తావించారు. మోదీ, అదానీ సాన్నిహిత్యం గురించి మాట్లాడారు. దీంతో భారత్‌వ్యాప్తంగా ఆయనపై విమర్శలు వచ్చాయి.

జార్ఖండ్ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

రాంచీ : తమిళనాడుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సీపీ రాధాకృష్ణన్ శనివారం జార్ఖండ్ 11వ గవర్నర్‌గా రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, క్యాబినెట్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయిన కార్యక్రమంలో జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్... సీపీ రాధాకృష్ణన్ (65) తో గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉందని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధించడమే అంతిమ లక్ష్యమని తెలిపారు. పేదరిక నిర్మూలనకు అభివృద్ధి ఒక్కటే సమాధానమని అన్నారు. కోయంబత్తూరు నుంచి రెండుసార్లు లోక్‌సభ సభ్యుడు అయిన రాధాకృష్ణన్... జులై 2021 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా పని చేసిన రమేష్ బైస్ స్థానంలో ఉన్నారు. 'రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మీ మార్గదర్శకత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్న పూర్తి విశ్వాసం నాకు ఉంది' అని కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం సోరెన్ ట్వీట్ చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, రాధాకృష్ణన్ రాష్ట్ర రాజధాని రాంచీకి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన ప్రముఖుడు బిర్సా ముండా జన్మ స్థలమైన ఖుంటి జిల్లాలోని ఉలిహాతు గ్రామాన్ని సందర్శించారు.

ఎన్నికల సంఘం... ప్రధాని మోదీకి బానిస

- శివసేన 'విల్లు-బాణం' గుర్తు దొంగిలించారు
- దొంగకు గుణపాఠం చెప్పాలి
- ఎన్నికలకు సిద్ధంగా ఉండండి
- శివసేన (యూటీబీ) నేత ఉద్ధవ్ ఠాక్రే

ముంబై : ఎన్నికల సంఘం ప్రధాని మోదీకి బానిస అని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ 'విల్లు-బాణం' గుర్తును దొంగిలించారని, దొంగకు గుణపాఠం చెప్పాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం పార్టీ నేతల సమావేశానికి అధ్యక్షత వహించే ముందు ఇక్కడ బాంద్రాలోని తన నివాసం 'మాతోశ్రీ' వెలుపల తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తమ బానిసగా మారిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించినప్పటికీ, శివసేనను ఎప్పటికీ అంతం చేయలేరన్న విషయాన్ని తెలుసుకోవాలని ఠాక్రే అన్నారు. 'నువ్వు భయపడ్డావా? ఇప్పుడు మీకు ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదు' అని సభాముఖంగా ప్రశ్నించారు. అతని మద్దతుదారులు వారు కాదని తిరిగి అరిచారు. తదుపరి కదలికకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సంఘం శుక్రవారం ముఖ్యమంత్రి షిండే నేతృత్వంలోని బృందానికి 'శివసేన' పేరు, ఎన్నికల చిహ్నం 'విల్లు-బాణం'ను కేటాయించింది. 1966లో బాల్ ఠాక్రే భూమి పుత్రులకు న్యాయం చేయాలనే సిద్ధాంతంతో స్థాపించిన పార్టీపై థాకరే కుటుంబం పట్టు కోల్పోవడం ఇదే తొలిసారి. థాకరే మాట్లాడుతూ ఇదివరకు ఎప్పుడూ చేయని ఓ పనిని ఇప్పుడు ఎన్నికల సంఘం చేసిందని ఆరోపణలు చేశారు. తన మద్దతుదారులు సహనంతో ఉండాలని సూచించారు. 'దొంగ తేనెటీగపై రాయి విసిరాడు. కానీ అతను తేనెటీగల కుట్టడం అనుభవించలేదు. ఎన్నికల్లో దొంగకు గుణపాఠం చెప్పే వరకు విశ్రమించకూడదు. తక్షణమే ఎన్నికలకు సిద్ధపడండి' అని ఠాక్రే పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి షిండే దొంగిలించిన విల్లు-బాణాన్ని మోయలేడని, శివ ధనస్సును ఎత్తలేని పురాణ రాక్షస రాజు రావణుడిలా కూలిపోతాడని తెలిపారు. ఇంతకుముందెన్నడూ ఈసీ ఇటువంటి వివాదాలలో ఒక వర్గానికి గుర్తు, పార్టీ పేరును ఇవ్వలేదని, అటువంటి పరిస్థితులలో గుర్తును స్తంభింపజేశారని ఠాక్రే చెప్పారు. 'కానీ ప్రధానమంత్రి బానిసలు ఇప్పుడు చేశారు' అని అన్నారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ పదవీ విరమణ తర్వాత ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా మారవచ్చని ఠాక్రే అన్నారు. శివసేన ఎవరికి చెందుతుందో ప్రజలే నిర్ణయిస్తారని, మహారాష్ట్రకు రావాలంటే ప్రధాని మోదీ 'బాలాసాహెబ్ థాకరే ముసుగు ధరించాలి' అని ఠాక్రే అన్నారు. 'దొంగకి థాకరే పేరు, బాలాసాహెబ్ ఫోటో కావాలి కానీ శివసేన కుటుంబం కాదు' అని షిండేను ఉద్దేశించి అన్నారు. ముసుగులు ధరించిన వారికి, నిజమైన వ్యక్తులకు మధ్య ఉన్న తేడాను ప్రజలు అర్థం చేసుకుంటారని తెలిపారు. 'విల్లు-బాణం దొంగిలించబడ్డాయి. దొంగకు గుణపాఠం చెప్పాలి. అతన్ని పట్టుకున్నారు. నేను దొంగను విల్లు-బాణంతో మైదానంలోకి రమ్మని సవాలు చేస్తున్నాను. మేము దానిని మండే మంటతో ఎదుర్కొంటాము' అని తెలిపారు. కాగా గుర్తు అనేది థాకరే నేతృత్వంలోని వర్గానికి గత సంవత్సరం ఈసీ కేటాయించిన చిహ్నం. పూణే జిల్లాలోని కస్బా పేత్, చించ్వాడ్ ఉప ఎన్నికల వరకు ఈ గుర్తు థాకరే శిబిరంలోనే ఉంటుందని ఎన్నికల సంఘం శుక్రవారం చెప్పింది. ఈ స్థానాలకు ఫిబ్రవరి 26న ఉప ఎన్నికలు జరగనున్నాయి. కాగా పార్టీ నాయకులు రాష్ట్రంలో పర్యటించి పార్టీ శ్రేణులను సమీకరించాలని థాకరే కోరినట్లు ఒక పార్టీ నాయకుడు తెలిపారు. తరువాత, ఠాక్రే తనకు విధేయులైన పార్టీ నాయకుల సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఏఐఏడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
విజయ్‌రాఘవన్, వెంకట్
155 మందితో జనరల్ కౌన్సిల్ ఎన్నిక

హౌరా: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయరాఘవన్, బి.వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏఐఏడబ్ల్యూయూ 10వ జాతీయ మహాసభలు శుక్రవారం ఇక్కడ ముగిశాయి. మహాసభ 155 మందితో జనరల్ కౌన్సిల్‌ని ఎన్నుకుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 12 మంది, తెలంగాణ నుంచి 15 మంది ఉన్నారు. ఆఫీసు బేరర్స్‌గా ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, గోవిందన్‌మాస్టార్, అమియపాత్ర, భానూలాల్ సాహా, లాజర్, జి.నాగయ్య, కె.కోమలకుమారి, భూప్‌చంద్ చన్నూ, విక్రమ్‌సింగ్, వి.శివదాసన్, తుషార్‌ఘోష్, వి.వెంకటేశ్వర్లు, బ్రిజ్‌లాల్ భారతి, ఎన్.చంద్రన్ ఎన్నికయ్యారు. కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగాఎంవీ గోవిందమాస్టార్, ఎన్.ఆర్.బాలన్, ఎన్.చంద్రన్, ఎ.నాగప్పన్, పీకేబిజు, కె.కోమలకుమారి, సీబీ దేవదర్శనన్, లలితాబాలన్, అంబిక, ఎ.డి.కున్నచ్చన్, అమియాపాత్ర, తుషార్‌ఘోష్, మిజనూర్ రహమాన్, సుకుమార్ చక్రవర్తి, రామకృష్ణరారుచౌదరి, హిమాన్షుదాస్, బొనియాతుడు, నిరపడ సర్థార్, జి.నాగయ్య, ఆర్.వెంకటరాముడు, బి.ప్రసాద్, బి.పద్మ, పి.వెంకటేశ్వర్లు, ఐలయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శివనాగరాణి, లాజర్ అమర్తలింగం, చిన్నదురై, పళనిస్వామి, పుంగత్తరు, భానూలాల్ సాహా, శ్యామల్‌దే, భూప్‌చంద్ చన్ను, రామ్‌సింగ్‌చ గుర్మేష్‌సింగ్, పుట్టమధు, చంద్రప్ప హొసకెర, మునివెంకటప్ప, భోలాప్రసాదు దివాకర్, ధర్మేంద్ర చౌరాసియా, రామ్‌శ్రే మహతో, బ్రిజ్‌లాల్ భారతి, సతీస్‌కుమార్, నీతూసాల్వే, సరిత శర్మ, రామ్‌రతన్ బగారియా, ప్రేమ్ కుమార్, నిర్మల్ నాయక్, రాంబాబు జాదవ్, ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, విక్రమ్‌సింగ్, వి,.శివదాసన్, బాబూమోహన్ ఎన్నికయ్యారు.

మహారాష్ట్ర గవర్నర్‌గా రమేశ్ బైస్ బాధ్యతల స్వీకరణ

ముంబై : మహారాష్ట్ర 22వ గవర్నర్‌గా భగత్ సింగ్ కోశ్యారీ స్థానంలో రమేశ్ బైస్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడి రాజ్ భవన్‌లో బాంబే హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.గంగాపూర్ వాలా... రమేశ్ బైస్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. బైస్ మరాఠీలో ప్రమాణం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. సెప్టెంబరు 2019 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన కోశ్యారీ వివాదాస్పద పదవీకాలం తర్వాత గత వారం రాజీనామా చేశారు.

దేశంలోకి మరో 12 చిరుతలు

దక్షిణాఫ్రికా నుంచి కునో జాతీయ పార్కుకు తరలింపు

గ్వాలియర్ : దక్షిణాఫ్రికా నుంచి 12 చిరుతలతో బయలుదేరిన భారత వైమానిక దళం (ఐఏఎఫ్) విమానం శనివారం ఉదయం మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దిగింది. ఈ చిరుతలను ఇక్కడి నుంచి 165 కిలోమీటర్ల దూరంలోని షియోపూర్ జిల్లాలోని కునో జాతీయ పార్కు (కేఎన్‌పీ) కి తీసుకెళ్లి క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లలోకి విడుదల చేస్తారు. ఈ చిరుతల్లో ఏడు మగ, ఐదు ఆడ చిరుతలు ఉన్నాయి. ఇవి రాష్ట్రానికి వస్తున్న రెండవ చిరుతల గుంపు. దేశంలో అంతరించిపోయిన చిరుతలను తిరిగి ప్రవేశపెట్టే చర్యల్లో భాగంగా భారత ప్రభుత్వం 'ప్రాజెక్టు చీతా'ను ప్రారంభించింది. ఈ క్రమంలోనే అనేక దేశాలతో ఒప్పందం చేసుకొని మళ్లీ మన దేశానికి చిరుతలను తీసుకువస్తోంది.

మొదట నమీబియాకు చెందిన ఎనిమిది చిరుతలను కునో జాతీయ పార్కుకు తీసుకువచ్చారు. గత సంవత్సరం సెప్టెంబరు 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక కార్యక్రమంలో ఆ చిరుతలను కేఎన్‌పీలోకి విడుదల చేశారు. ఇప్పుడు తాజాగా మరో 12 చిరుతలను దక్షిణాఫ్రికా నుంచి ఈ పార్కుకు తీసుకువచ్చారు. ఐఏఎఫ్ సీ-17 గ్లోబ్ మాస్టర్ విమానం 12 చిరుతలతో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దిగిందని అధికార వర్గాలు తెలిపాయి. 'దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్ నుంచి 10 గంటల సుదీర్ఘ విమాన ప్రయాణం తర్వాత చిరుతలతో కూడిన విమానం ఉదయం 10 గంటలకు గ్వాలియర్ విమానాశ్రయంలో దిగింది' అని గ్వాలియర్ పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) అమిత్ సంఘీ పీటీఐకి తెలిపారు. గ్వాలియర్‌లో క్లియరెన్స్ ప్రక్రియ తర్వాత, ఈ చిరుతలను ఐఏఎఫ్ హెలికాప్టర్‌లో కేఎన్‌పీకి తరలించనున్నట్లు మరొక అధికారి తెలిపారు. ఈ క్రమంలోనే కునో జాతీయ పార్కులోని చిరుతల సంఖ్యను పెంచినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా సీఎం చౌహాన్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఆ చిరుతలను నిర్బంధ బోమాలలోకి విడుదల చేస్తారని ఆయన తెలిపారు. ఈ జంతువులు దక్షిణాఫ్రికాలోని గౌటెంగ్‌లోని ఓఆర్ టాంబో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐఏఎఫ్ రవాణా విమానంలో వేల మైళ్ల దూరంలో ఉన్న తమ కొత్త ఇంటికి ప్రయాణాన్ని ప్రారంభించాయని ప్రాజెక్టు పర్యవేక్షకుడు, నిపుణుడు పీటీఐకి తెలిపారు. దక్షిణాఫ్రికా చిరుతల కోసం 10 క్వారంటైన్ బోమాలను ఏర్పాటు చేసినట్లు కేఎన్‌పీ డైరెక్టర్ ఉత్తమ్ శర్మ తెలిపారు. చిరుతలను ఉంచేందుకు వన్యప్రాణుల అభయారణ్యంలో ఏర్పాట్లను చూసేందుకు దక్షిణాఫ్రికాకు చెందిన ప్రతినిధి బృందం గత ఏడాది సెప్టెంబరులో కేఎన్‌పీని సందర్శించిందని నిపుణులు తెలిపారు. దక్షిణాఫ్రికా ఈ చిరుతలను భారతదేశానికి విరాళంగా ఇచ్చింది. అయితే ప్రతి చిరుతను అక్కడ నుంచి తరలించే ముందు ఆఫ్రికా దేశానికి పట్టుకోవడానికి భారతదేశం 3 వేల డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని వన్యప్రాణి నిపుణుడు తెలిపారు.

కరోనా తర్వాత పెరిగిన కేన్సర్ రోగులు : బాబా రాందేవ్

పనాజీ: కరోనా మనకు ఎన్నో ఆరోగ్య సమస్యలను తెచ్చిపెట్టిందని, మరీ ముఖ్యంగా కేన్సర్ రోగులు పెరిగిపోయారని యోగా గురు బాబా రాందేవ్ చెప్పారు. కరోనా వ్యాప్తి ముగిసినప్పటి నుంచి కేన్సర్ రోగులు బయటకు వస్తున్నారని ఆయన తెలిపారు. కేన్సర్‌తోపాటు దృష్టి లోపం, వినికిడి లోపం వంటి సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారని చెప్పారు. శనివారం ఉదయం గోవాలోని మిరామార్ బీచ్‌లో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మూడు రోజు యోగా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రాందేవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్య మంత్రి ప్రమోద్ సావంత్ కూడా పాల్గొన్నారు. అంతకుముందు మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సావంత్‌తో కలిసి శివలింగం అభిషేకంలో బాబా రాందేవ్ పాల్గొన్నారు. 'కరోనా తగ్గింది. ఇప్పుడు కేన్సర్ కేసులు బయటకు వస్తున్నాయి. ప్రజలు కంటి చూపుతోపాటు వినికిడి సామర్థ్యాన్ని కూడా కోల్పోయారు. గోవా వెల్‌నెస్ కేంద్రంగా మారాలని నేను కూడా కలలు కంటున్నాను. ఆధ్యాత్మికతతో కూడిన పర్యాటక కేంద్రంగా గోవా మారాలి' అని రాందేవ్ అన్నారు.

కొత్త చిహ్నాన్ని తీసుకోండి
ఉద్ధవ్ ఠాక్రేకు శరద్ పవార్ సూచన



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన శివసేన పేరు, విల్లు బాణం గుర్తును ముఖ్యమంత్రి శిండే వర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) శుక్రవారం కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ అంశంపై ఏం చేయాలి అన్నదానిపై ఉద్ధవ్ ఠాక్రే తలమునకలయ్యారు. ఎంవీఏ కూటమిలో కీలకమైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. విల్లు బాణం గుర్తును శిండే వర్గానికి వదిలేసి కొత్త ఎన్నికల చిహ్నాన్ని తీసుకోవాలని ఉద్ధవ్ ఠాక్రేకు సూచించారు. ఈసీ చర్య వల్ల పెద్దగా ప్రభావం ఉండదని, కొత్త చిహ్నాన్ని ప్రజలు ఆమోదిస్తారని పవార్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఒకసారి నిర్ణయం తీసుకున్నాక ఇక చర్చకు అవకాశం ఉండదని చెప్పారు. ఈ నేపథ్యంలో కొత్త చిహ్నాన్ని అంగీకరించాలని ఉద్ధవ్ ఠాక్రేకు సూచించారు. పాత గుర్తు మాదిరిగానే కొత్త గుర్తును ప్రజలు ఆదరిస్తారని అన్నారు. గతంలో ఇందిరా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కూడా ఇలాంటి సంఘటనను ఎదుర్కొందని పవార్ గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు గతంలో 'కాడితో ఉన్న రెండు ఎద్దులు' గుర్తు ఉండేదని తెలిపారు. అయితే కాంగ్రెస్ దానిని కోల్పోయిందని, ఆ తర్వాత కొత్త చిహ్నంగా 'హస్తం' గుర్తును స్వీకరించిందని చెప్పారు. ప్రజలు ఆ గుర్తును ఆమోదించి చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని ఆదరించిన సంగతిని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రేవర్గం తీసుకునే కొత్త చిహ్నాన్ని కూడా ప్రజలు అదే విధంగా అంగీకరించి ఆదరిస్తారని అన్నారు.

చాలీచాలని వేతనాలు...

- పనిమనుషుల దయనీయ స్థితి
- గంటలకొద్దీ పని చేస్తున్నా శ్రమకు దక్కని గౌరవం
- దాడులు... ఆంక్షలు ఎదుర్కొంటున్న వైనం

న్యూఢిల్లీ : దేశంలో పనిమనుషుల పరిస్థితి దయనీయంగా ఉంది. చాలీచాలని వేతనాలతో వారు కుటుంబాలను పోషించుకోవలసిన దుస్థితి నెలకొంది. గంటల కొద్దీ పని చేస్తున్నా వారి శ్రమకు తగిన ఆర్థిక ప్రతిఫలం, గౌరవం దక్కడం లేదు. దీనికితోడు యజమానుల నుంచి దాడులు, ఆంక్షలకు గురవుతున్నారు. ఇది ఇప్పుడు మరింత ఆందోళన కలిగించే విషయంగా మారింది. అలాగే ప్రసూతి, అనారోగ్య సమయాల్లో పని కోల్పోవడమే కాకుండా ఆర్థిక మద్దతు అందుకోలేకపోతున్నారు. భారతదేశం అంతటా మహిళలు... ప్రధానంగా పేదింటి మహిళలు ఇంటి పనిలో ఎక్కువ భాగం చేస్తారు. వ్యవసాయ దిగుబడి, గ్రామీణ జీవనోపాధి భద్రత గణనీయంగా తగ్గడం వల్ల గ్రామీణ ప్రజలు నగరాలకు వలస వెళ్లి ఇంటి పనికి మారుతున్నారు. అయితే దేశంలో పేదరికాన్ని తగ్గించడమే ధ్యేయమని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సైతం గృహ పనివారలకు ఆర్థికంగా, సామాజికంగా రక్షణ కల్పించడంలో తీవ్రంగా విఫలమైందన్న విమర్శలు వస్తూనే ఉన్నాయి. దేశంలో ఉపాధి, ఉద్యోగ కల్పనా చర్యలు మృగ్యమవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వస్తున్న కుటుంబాల్లోని మహిళలు గృహ పనివారలుగా శ్రమిస్తున్నారు. కానీ తగిన వేతనం పొందలేక ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఇటీవల ఒక అధ్యయనం... గృహ కార్మికులు కనీస వేతనం సంపాదించడానికి కనీసం ఆరు కుటుంబాలలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొంది. కార్మికులు చేసే పనుల సంఖ్య, శుభ్రపరచడం, ఆహార తయారీ, నిర్వహణ, అలాగే ఈ పనులకు వెచ్చించే సమయం కార్మికుల వేతనాలను నిర్ణయిస్తాయి. వేతనాలను నిర్ణయించేటప్పుడు నైపుణ్యం, అనుభవం పెద్దగా లెక్కించబడవని అధ్యయనం కనుగొంది. అధికారిక గణాంకాల ప్రకారం భారతదేశంలో 4.75 మిలియన్ల మంది గృహ కార్మికులు ఉన్నారు. ఆర్థిక వ్యవస్థలో, కార్మిక మార్కెట్‌లో గృహ పనివారలు కీలక పాత్ర పోషిస్తారు. అయితే 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 10 మాత్రమే గృహ కార్మికులను కనీస వేతనాల చట్టం షెడ్యూల్‌లో చేర్చాయి. జీవన వ్యయం ఎక్కువగా ఉన్న పెద్ద నగరాలలో కనీస వేతనం లేకుండా పోయింది. ఇక చెల్లింపు ప్రసూతి సెలవులకు యజమానులు ఇష్టపడటం లేదని వెల్లడయింది. చెన్నైలోని దాదాపు 62 శాతం, బెంగళూరులోని 32 శాతం కుటుంబాలు ఒక గృహ కార్మికురాలు గర్భవతి అయినట్లయితే, ఆమె సేవలను నిలిపివేయడానికి ఇష్టపడతారని చెప్పారు. బెంగుళూరులో 68 శాతం కుటుంబాలు వారానికోసారి సెలవు ఇస్తామని చెప్పగా, చెన్నైలో 80 శాతం మంది అదే పని చేస్తామని చెప్పారు. గృహ పనివారలు అనారోగ్యానికి గురయిట్లయితే, వారికి యజమానుల నుంచి ఎటువంటి ఆర్థిక మద్దతు కూడా అంతంత మాత్రంగానే ఉంటుందని స్పష్టమయింది. ఇక కార్మికులను నియమించుకునేటప్పుడు పెద్ద నగరాలలో ప్రాధాన్యతలలో తేడాలు ఉన్నాయి. కులం, మతం ఎంతోకొంత ప్రాధాన్యత ఉంటుందని వెల్లడయింది.

దాడులు... ఆంక్షలు

ధనిక భారతీయ కుటుంబాలు పట్టణ ప్రాంతాల్లో గృహ కార్మికులపై హింసాత్మకంగా దాడి చేయడం వంటి ఘటనలు విపరీతంగా పెరుగుతున్నాయి. నోయిడాలోని సెక్టార్ 120లోని క్లియో కౌంటీ సొసైటీలో ఒక మహిళ ఇంటి పనిమనిషిని ఎలివేటర్‌లోంచి బయటకు లాగడం పెద్ద వివాదానికి దారితీసింది. ఈ కేసు దేశంలోని గృహ పనివారల హక్కుల గురించి, అసంఘటిత రంగంలోని కార్మికులను రక్షించడానికి చట్టం ఆవశ్యకత గురించి ఆందోళనలను లేవనెత్తింది. అనేకమంది నిరుపేద మహిళలు కుటుంబ పోషణ కోసం ఇంటి పనికి మారారు. అయితే అవసరమైన సేవలను అందిస్తున్నప్పటికీ, గృహ పనివారలకు హక్కులు, రక్షణ అందుబాటులో లేదు. వారు వేధింపులకు, దాడికి, వారి స్వేచ్ఛపై ఆంక్షలకు కూడా గురవుతున్నారు. జాతీయ కార్మిక, సామాజిక భద్రతా చట్టాలలోని అమలు సమస్యలు, లొసుగుల కారణంగా ఈ రంగంలో అనధికారికత ఏర్పడింది. గృహ పనివారలను వేధింపుల నుంచి రక్షించడానికి చురుకైన కార్యక్రమాలు అవసరం. చాలా మంది గృహ పనివారలు తమ హక్కులను తెలుసుకోవడంలో వారికి సహాయపడే కార్మిక సంఘాలు, సామాజిక-ఆధారిత సంస్థల పరిధికి వెలుపల ఉన్నారు. కార్మిక సంఘాలు, సామూహిక చర్య గృహ కార్మికులు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి అత్యంత ప్రయోజనకరమైన మార్గాలుగా ఉన్నాయి.

ఆర్టీసీ ఈయూ నేత
వైవీ రావు హఠాన్మరణం

- సీపీఐ, ఏఐటీయూసీ నేతల దిగ్భ్రాంతి
- సీఎం సంతాపం
- ముగిసిన అంత్యక్రియలు
- పాడె మోసిన ఆర్టీసీ ఎండీ
- కార్మికుల కన్నీటి నివాళి
- ఉద్యోగ, కార్మిక ఉద్యమానికి తీరనిలోటు: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి మాజీ ప్రధాన కార్యదర్శి వైవీరావు (60) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. టీవీ డిబేట్‌లో పాల్గొని శుక్రవారం రాత్రి 10 గంటలప్పుడు గొల్లపూడిలోని నివాసానికి చేరుకున్న వైవీ రావు కుర్చీలో సేద తీరుతూనే తీవ్ర గుండెపోటుకు గురై మరణించారు. ఆయన సతీమణి భోజనానికి ఆహ్వానించగా, 10 నిమిషాలు ఆగి తింటానని చెప్పారు. ఆ తర్వాత కొద్ది నిముషాలకే కుప్పకూలిపోయారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన ఇతోధిక కృషిచేశారు. ప్రైవేటు బస్సుల జాతీయాకరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ కార్మికుల గుర్తింపు కోసం ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. అందరితో ఆప్యాయంగా మెలిగే చురుకైన ఉద్యమనేతగా పేరుగాంచారు. ఆయన మరణవార్త తెల్సుకుని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులతోపాటు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఏఐటీయూసీ, సీపీఐ శ్రేణులు, వారి బంధువులు పెద్దసంఖ్యలో గొల్లపూడి భారీగా తరలివచ్చారు. ఈ వార్త తెలియగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంతాపం ప్రకటిస్తూ, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఓబులేసు, జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, గౌరవ అధ్యక్షులు వి.రాధాకృష్ణ మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, ఎన్టీఆర్ జిల్లా, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజు, ప్రధానకార్యదర్శి కేవీ శివారెడ్డి, అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అమరావతి జేఏసీ సహ చైర్మన్ టీవీ ఫణి, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్, ఎన్‌జీఓ నాయకులు విద్యాసాగర్, ఏపీజీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు, ఆర్టీసీ ఈయూ మాజీనేత జీడీ ప్రసాద రెడ్డి, ఈయూ రాష్ట్ర, జోన్, జిల్లా నాయకులు పి సుబ్రమణ్యం రాజు, జి.నారాయణరావు, సి.నబీ రసూల్, జోనల్ అధ్యక్షులు వాకా రమేశ్, కార్యదర్శులు షేక్ సుభాని, డి.బాబు శ్యామ్యూలు, జిల్లా కార్యదర్శులు వై.యస్.రావు, జి.చిరంజీవి, రాంబాబుతో పాటుగా ఆర్టీసీ ఎస్‌ఎంయూ రాష్ట్ర నాయకులు సుబ్బారావు, శ్రీనివాసరాజు, వైఎస్సార్ అసోషియేషన్ నాయకులు డీఎస్‌పీ రావు, గిత్తం శ్రీనివాస రావుతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సంతాపం ప్రకటించారు.

కార్మిక పక్షపాతి వైవీ: ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

వైవీ మృతి వార్త తెలియగానే గొల్లపూడి చేరుకున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని తన భుజాలపై వైవీ భౌతికకాయాన్ని మోసి కన్నీటి నివాళులర్పించారు. స్నేహశీలి, మృదుస్వభావి అయిన వైవీ కార్మికపక్షపాతి అని కొనియాడారు. చాకచక్యంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని, నిగర్వి, నిజాయితీ కల్గిన నేత అని శ్లాఘించారు. కార్మికులకు ఆయన చేసిన సేవ శాశ్వతంగా నిల్చిపోతుందని, ఆయన మృతి నమ్మలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఐటీయూసీ నేతల దిగ్భ్రాంతి

వైవీ రావు మృతికి ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈయూ పటిష్టతకు, ఏఐటీయూసీ బలోపేతానికి, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను సీపీఐ వైపు ఆకర్షితులను చేయడంలో ఆయన చేసిన కృషి అపూర్వమన్నారు. ఉద్యోగ సంఘాల ఐక్య ఉద్యమంలో పోషించిన పాత్ర అమోఘమని, వైవీ మృతి ఏఐటీయూసీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మిక ఉద్యమానికి తీరనిలోటు: రామకృష్ణ, ముప్పాళ్ళ

వైవీ రావు మృతి కార్మిక ఉద్యమానికి తీరనిలోటని కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రైవేటు బస్సుల జాతీయాకరణ ఉద్యమంలో, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారంలో, సంస్థను ప్రభుత్వ విలీనంలోనూ ఆయన చేసిన కృషి అపూర్వమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ పటిష్టతలో వైవీ పాత్ర చిరస్మరణీయమన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

22న దిల్లీ మేయర్ ఎన్నిక

సీఎం సిఫార్సు- ఎల్‌జీ ఆమోదం

న్యూదిల్లీ: దిల్లీ మేయర్ ఎన్నికకు మహూర్తం ఖరారైంది. సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు ఈనెల 22వ తేదీన మేయర్ ఎన్నిక నిర్వహించాలన్న దిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు రాజ్‌నివాస్ అధికారులు శనివారం తెలిపారు. 22వ తేదీన మేయర్ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిఫార్సు చేసిన కొన్ని గంటల తర్వాత ఎల్‌జీ తన ఆమోదాన్ని తెలిపారు. దీంతో రెండున్నర నెలల తర్వాత మేయర్ ఎన్నిక విషయంలో స్పష్టత లభించినట్లు అయింది. ఇప్పటికే మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడింది. నామినేటెడ్ సభ్యుల ఓటు హక్కు విషయంలో బీజేపీ, ఆప్ మధ్య వాగ్వాదంతో ఎన్నిక కోసం జరిగే సమావేశాలు రసాభాస అయ్యాయి. దీంతో అధికార ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సర్వోన్నత న్యాయస్థానం వెంటనే మేయర్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 24 గంటల్లోగా తేదీ ఖరారు చేయాలని శుక్రవారం ఉత్తర్వుల్లో పేర్కొంది. మేయర్ ఎన్నికైన వెంటనే డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక జరగాలని సూచనలు చేసింది. నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కును రాజ్యాంగం కల్పించలేదని కోర్టు స్పష్టంగా తెలిపింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులపై కేజ్రీవాల్ అమితానందాన్ని వ్యక్తం చేశారు. ట్విట్టర్ మాధ్యమంగా తన సంతోషాన్ని పంచుకున్నారు. మరోక్షణం ఆలశ్యం చేయకుండా ఎంసీడీ మేయర్ ఎన్నికకు ఈనెల 22వ తేదీని సిఫార్సు చేశారు.

టర్కీ వరద సాయాన్ని భూకంప సాయంగా తిరిగిచ్చేసిన పాక్

ఇస్లామాబాద్: ఏదిఏమైనా పాకిస్తాన్ పంథానే వేరు... అసలు ఆ దేశం రూటే సపరేటు. ప్రకృతి విలయానికి విలవిల్లాడిపోయిన టర్కీకి ప్రపంచ దేశాలు ఆర్థిక-వస్తు-వైద్య సాయాన్ని అందిస్తుంటే పాకిస్తాన్ అందరికంటే భిన్నంగా గతంలో తమ దేశానికి ఆపన్నహస్తం అందిస్తూ టర్కీ పంపిన 'వరద సాయాన్ని' చక్కగా గిఫ్ట్‌ప్యాక్ చేసి ఆ దేశానికి తిప్పిపంపింది. ఇది చూసిన టర్కీ అధికారులు కంగుతిన్నారు. బాక్సులపై వివాలు కూడా అదే విధంగా ఉంచడం వల్ల పాకిస్తాన్ తీరుపై విమర్శలొచ్చాయి. గతేడాది పాకిస్తాన్ వరదపోటుకు గురైంది. ఆ సయంలో టర్కీ తమ వంతుగా సహాయక సామాగ్రిని పాకిస్తాన్‌కు పంపింది. ఇప్పుడు అదే సామాగ్రిని తిరిగి టర్కీకి భూకంప సాయం కింద అంకారాకు పంపింది. దీనిపై అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. పైన కొత్త బాక్సులను ఉంచిన పాక్ లోపలి పాత బాక్సులను మార్చడం మర్చింది. బయటి బాక్సులపై భూకంప బాధితుల కోసం పాకిస్తాన్ ప్రజలు పంపిన సాయం' అని రాసి ఉంది. లోపల ఉన్న బాక్సుల్లో మాత్రం వరదల్లో అల్లాడుతున్న పాక్ ప్రజలకు సాయం అందించేందుకు టర్కీ ప్రజలు పంపుతున్న సామగ్రి' అని ఉంది. టర్కీకి పంపిన ఈ సాయాన్ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యవేక్షించారు. దీంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే విషయాన్ని పాక్ విదేశాంగ మంత్రి దృష్టికి టర్కీ కాన్సులేట్ జనరల్ తీసుకెళ్లినట్లు సమాచారం. షెహబాజ్ షరీఫ్ టర్కీలో పర్యటించారు. భూకంపం సంభవించిన రెండు రోజుల తర్వాత షరీఫ్, పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ ఆ దేశానికి వెళ్లాలనుకున్నారు. అయితే సహాయక చర్యల్లో బిజీగా ఉన్నందున ఆ పర్యటనను వాయిదా వేసుకోవాలని టర్కీ ప్రభుత్వం షరీఫ్‌కు సూచించింది. పాక్ ప్రధాని నిర్ణయంపై స్వదేశంలో విమర్శలు వచ్చాయి. ఆర్థిక సంక్షోభంతో నిత్యావసరాలు దిగుమతి చేసుకోవడమే కష్టంగా ఉన్న సమయంలో పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో విదేశీ పర్యటనలు అవసరమా అని ప్రజలు ప్రశ్నించారు షెహబాజ్ మాత్రం రెండు రోజుల కిందట టర్కీకి వెళ్లి అక్కడి భూకంప బాధితులను పరామర్శించారు. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగన్‌ను కలిసి సానుభూతి తెలిపారు.

తెలంగాణలో 16 పబ్‌లలో ఆకస్మిక దాడులు...అరెస్టులు

హైదరాబాద్: తెలంగాణలో పబ్ సంస్కృతి విపరీతంగా పెరిగిపోయింది. మైనర్లు సైతం మద్యం సేవిస్తూ రచ్చచేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో పబ్ ఆగడాలను కట్టడి చేసే యోచనలో మాదాపూర్ పోలీసులు స్థానిక 16 పబ్‌లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెండు పబ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా మైనర్లకు మద్యం సరఫరా చేసినట్టుగా గుర్తించారు. హాట్ కప్, బర్డ్ బాక్స్ పబ్‌లపై కేసులు నమోదు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మైనర్లకు మద్యం సరఫరా చేసినందుకు హాట్ కప్ పబ్‌పై, లైసెన్సు లేని కారణంగా బర్డ్‌బాక్స్ పబ్‌పై కేసులు నమోదయ్యాయి. ఫామ్‌హౌజ్‌లలో మద్యం సరఫరాపైనా పోలీసులు చర్యలు చేపట్టారు. అనుమతి లేకుండా ఫామ్‌హౌజ్‌లోకి మద్యం తీసుకెళ్లినందుకు మొయినాబాద్‌లోని సెలబ్రిటీ, ఎటెర్నిటీ, ముషీరుద్దీన్ ఫామ్‌హౌజ్‌లపై కేసులు నమోదు చేశారు. ఇటీవల సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఫామ్‌హౌజ్‌లు, పబ్‌లపైనా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్, మొయినాబాద్, మేడ్చల్ శివారు ప్రాంతాల్లోని 32 పబ్‌లలో తనిఖీలు నిర్వహించి నాలుగింటిలో నిబంధనలకు విరుద్ధంగా జూదం, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తించి 22 మందిని అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రాజెక్ట్-కె నుంచి అదిరిపోయే అప్‌డేట్

హైదరాబాద్: మహాశివరాత్రి సందర్భంగా ప్రభాస్ అభిమానులకు 'ప్రాజెక్ట్-కె' (వర్కింగ్ టైటిల్) చిత్ర బృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ ఇది. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ తెలిపింది. ఈ సినిమాకు సంబంధించి ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. భారీ చేయి కింద పడి ఉండగా, ముగ్గురు వ్యక్తులు గన్స్‌తో చేయి వైపు గురి పెడుతూ నిలబడ్డారు. హాలీవుడ్ యాక్షన్ ఫిల్మ్‌ను తలపించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే తెలుస్తోంది. మరోవైపు 'ప్రాజెక్ట్ కె' సినిమాను కూడా రెండు భాగాలుగా తీసుకొచ్చే అవకాశాలున్నట్టు సమాచారం. ఆ దిశగా చిత్రబృందం ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై వారి నుంచి మాత్రం ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఎవరూ స్పృశించని కథతో.. అత్యాధునిక హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు నాగ్ అశ్విన్.

ప్రభాస్ అభిమానులకు నాలుగు నెలలకో పండగ..

తమ అభిమాన కథానాయకుడి నుంచి సినిమా ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్న ప్రభాస్ అభిమానులకు ఈ ఏడాది బ్లాక్ బస్టర్ బొనాంజా తగిలినట్లే. ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆది పురుష్'. ప్రభాస్ ఇందులో రాముడిగా నటిస్తుండగా, సీత పాత్రలో కృతి సనన్ కనిపించనుంది. రావణ్ పాత్రలో సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు. ఈ సినిమాను వేసవి కానుకగా జూన్ 16న విడుదల చేయనున్నారు. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సలార్'. శ్రుతిహాసన్ కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. హోంబాలే ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ మూవీ సెప్టెంబరు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ రెండు సినిమాలకు సంబంధించి రిలీజ్ డేట్స్‌ను ప్రకటించారు. ఇప్పుడు 'ప్రాజెక్ట్-కె'ను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న తీసుకొస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించడంతో నాలుగు నెలలకో ప్రభాస్ సినిమా రానుంది. వీటితో పాటు మారుతీ దర్శకత్వంలోనూ ప్రభాస్ ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అన్నీ అనుకున్నట్లు వస్తే, ప్రభాస్ అభిమానులకు అంతకుమించిన పండగ ఇంకేముంటుంది.

దిల్లీ మద్యం కేసులో సిసోడియాకు మళ్లీ సమన్లు

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియాకు మళ్లీ సీబీఐ సమన్లు జారీ అయ్యాయి. ఆదివారం తమ కేంద్ర కార్యాల యంలో విచారణకు హాజరు కావాలని దర్యాప్తు అధికారులు ఆయనకు సూచించారు. ఈ కేసులో చార్జిషీటు దాఖలైన మూడు నెలల తర్వాత సిసోడియాను ప్రశ్నించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సిసోడియాతో పాటు మిగతా వారి విచారణ కొనసాగుతున్నందున చార్జిషీటులో నిందితులుగా వారి పేర్లను పేర్కొనలేదన్నారు. తనకు సీబీఐ సమన్లు అందినట్లు సిసోడియా ట్వీట్టర్ మాధ్యమంగా తెలిపారు. దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తున్నట్లు తెలిపారు. తన వద్ద నుంచి తనిఖీల్లో ఏమీ లభించకపోవడాన్ని కూడా గుర్తు చేశారు. 'సీబీఐ నన్ను మళ్లీ విచారణకు పిలిచింది. ఈడీ, సీబీఐల పూర్తి అధికారాన్ని నాపై ప్రయోగించారు. నా ఇంటిపై దాడులు చేశారు. బ్యాంకు లాకర్ సోదా చేశారు. కానీ వారికి ఏమీ లభించలేదు' అని సిసోడియా ట్వీట్ చేశారు. దిల్లీలో పిల్లలకు విద్య అందించే 'మంచి పని' చేస్తున్న తనను ఆపాలని 'వారు' అను కున్నారు కాబట్టే సీబీఐ తన వెంట పడిందని వ్యాఖ్యా నించారు. ఇదిలావుంటే సీబీఐ దర్యాప్తు పూర్తిగా 'సౌత్ లాబీ'పై ఉన్నదని దర్యాప్తు సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. సౌత్ లాబీ అన్నది వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల అడ్డాగా చెబుతున్నారు. కాగా, సిసోడియాతో పాటు మరో 14 మందిపై సీబీఐ గతేడాది ఆగస్టులో ప్రత్యేక కోర్టులో కేసు నమోదు చేసింది. గతేడాది నవంబరు తీసుకొచ్చిన దిల్లీ మద్యం విధానం అమలులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సిఫార్సు చేశారు. అనంతరం ఆ విధానాన్ని దిల్లీ ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

ఆదుకున్న అక్షర్... ఆధిక్యంలో ఆస్ట్రేలియా

దిల్లీ: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఒక పరుగు ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ 21/0 స్కోరుతో రెండో రోజు తమ తొలి ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన టీమిండియా ఆసీస్ స్పిన్నర్ల ధాటికి 262 పరుగులకు ఆలౌటైంది. భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (74) అర్ధశతకం సాధించగా.. విరాట్ కోహ్లి (44), అశ్విన్ (37), రోహిత్ శర్మ 32, రవీంద్ర జడేజా (26) ఫర్వాలేదనిపించారు. నాథన్ లైయన్ 5, కుహ్నెమన్ 2, మర్ఫీ 2 వికెట్లు తీశారు. అంతకుముందు ఆసీస్ తన తొలి ఇన్నింగ్స్‌లో 263 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది. దీంతో ఆసీస్ ఆధిక్యం 62 పరుగులకు చేరింది.

లంచ్‌కు ముందు లైయన్ జోరు

21/0 ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా కొద్దిసేపు నిలకడగానే ఆడింది. తర్వాత లైయన్ విజృంభించడంతో వరుసగా వికెట్లు కోల్పోయింది. 17వ ఓవర్‌లో కేఎల్ రాహుల్ (17)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న లైయన్.. తన తర్వాతి ఓవర్‌లో రోహిత్ శర్మ (32), పుజారా (0)లను ఔట్ చేసి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (4) కూడా నాథన్ బౌలింగ్‌లో హ్యాండ్స్‌కాంబ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.

అదరగొట్టిన అక్షర్ పటేల్

విరాట్ కోహ్లి ఔటైన తర్వాత క్రీజులోకి అక్షర్ పటేల్ ఆది నుంచి దూకుడుగా ఆడాడు. టీ బ్రేక్‌కు ముందు కుహ్నెమాన్ వేసిన ఓవర్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. తర్వాత కూడా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొట్టాడు. కుహ్నెమాన్ వేసిన 75వ ఓవర్‌లో సిక్సర్ బాది అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కమిన్స్ వేసిన 79వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదాడు. మరో ఎండ్‌లో ఉన్న అశ్విన్ (37) అతడికి సహకారం అందించాడు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అశ్విన్‌ను కమిన్స్ ఔట్ చేయగా.. మార్ఫీ వేసిన తర్వాతి ఓవర్‌లో సిక్సర్ బాది జోరు మీద కనిపించిన అక్షర్ పటేల్ కమిన్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన షమి (2)ని కుహ్నెమాన్ పెవిలియన్‌కు పంపడంతో భారత్ ఆలౌటైంది.

విరాట్ హాఫ్ సెంచరీ మిస్

నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన భారత్‌ను కోహ్లి, జడేజా ఆదుకున్నారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా నిలకడగా సింగిల్స్ తీస్తూ స్కోరు బోర్డును ముందుకు కదిలించారు. అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని మార్ఫీ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో జడేజా (26) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. కొద్దిసేపటికే విరాట్ కోహ్లి (44)ని కొత్త స్పిన్నర్ కుహ్నెమాన్ వెనక్కి పంపాడు. తర్వాతి ఓవర్‌లో శ్రీకర్ భరత్ (6)ను ఔట్ చేసి నాథన్ లైయన్ ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు.

టెస్ట్ క్రికెట్‌లో బెన్ స్టోక్స్ రికార్డ్

ముంబై: ఇంగ్లండ్ ఆల్‌రౌండర్, ఆ జట్టు టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను అధిగమించి టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అతడు రెండు సిక్సర్లు బాది మెక్‌కల్లమ్ (107) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. ప్రస్తుతం స్టోక్స్ (109) సిక్స్‌లతో అగ్రస్థానంలో ఉండగా, మెక్‌కల్లమ్ (107), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (100) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ జాబితాలో టాప్-10లో భారత్ నుంచి వీరేంద్ర సెహ్వాగ్ (91) ఒక్కడే ఉన్నాడు. ఇక, ఇంగ్లండ్, కివీస్ మ్యాచ్ విషయానికొస్తే.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసింది. మరో ఐదు వికెట్లను పడగొడితే ఇంగ్లండ్‌దే గెలుపు. మరోవైపు కివీస్ విజయం సాధించాలంటే 331 పరుగులు చేయాల్సి ఉంది.. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 306 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లండ్ 325/9 వద్ద డిక్లేర్డ్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 374 పరుగులకు ఆలౌటై.. న్యూజిలాండ్ ఎదుట 394 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది.

గిల్డ్ మాఫియాతో ప్రమాదం: సీ కల్యాణ్



హైదరాబాద్: నిర్మాతల మండలిలోని గిల్డ్ సభ్యుల మాఫియా వల్ల చిత్ర పరిశ్రమ ప్రమాదంలో పడబోతుందని నిర్మాతల మండలి మాజీ అధ్యక్షుడు సి.కళ్యాణ్ ఆరోపించారు. చిన్న సినిమాలను అణగదొక్కుతూ పరిశ్రమను నాశనం చేస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆదివారం నిర్మాతల మండలి నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరుగబోతున్న వేళ.. మీడియా ముందుకొచ్చిన సి.కళ్యాణ్, గిల్డ్ పేరుతో 27 మంది నిర్మాతలు పరిశ్రమను ఎలా దోపిడి చేస్తున్నారో వివరించారు. నిర్మాతల మండలి సభ్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఎల్‌ఎల్‌పీని తప్పుదోవ పట్టించి, వాణిజ్య ప్రకటనలు, అవార్డుల పేరుతో డబ్బు దోచుకుంటున్నారని కల్యాణ్ ఆరోపించారు. నిర్మాతల మండలి ఎన్నికల్లో గిల్డ్ సభ్యులు పోటీ చేస్తుండటంపై ఆభ్యంతరం వ్యక్తం చేశారు. చిన్న నిర్మాతలను బతికిస్తేనే చిత్ర పరిశ్రమ బాగుపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న దామోదరప్రసాద్ తరపు వారు నిర్మాత దిల్ రాజును తప్పుదోవ పట్టించి తమ ప్రచారానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. అయితే, గిల్డ్ మాఫియాలో దిల్‌రాజు కూడా భాగస్వామేనని విమర్శించారు. "మేం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. ఎవరు న్యాయం చేస్తారో వారిని గెలిపించండి. నేను ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. 30 ఏళ్ల అనుబంధంతో నిర్మాతల మండలిని రక్షించుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చా. ప్రొడ్యూసర్ గిల్డ్, నిర్మాతల మండలిని కలిపేందుకు ప్రయత్నం చేశా. కానీ అధ్యక్ష పదవి మోజులో నా ప్రయత్నాన్ని నీరుగార్చారు. దిల్ రాజు, సి.కల్యాణ్ ప్యానెల్ వేర్వేరు కాదు. నిర్మాతలు కొంతమంది దిల్ రాజును తప్పుదారి పట్టించారు. దిల్ రాజుతో నన్ను పోలుస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక గతంలో సినిమా షూటింగ్స్ నిలిపివేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు జరగలేదు. నిర్మాతల మండలిలో ఇప్పుడు దామోదర ప్రసాద్ నాలుగేళ్లు కార్యదర్శిగా ఉన్నారు. చేసిందేమీ లేదు. చిన్న నిర్మాతలకు నిర్మాతల మండలిలో అన్యాయం జరుగుతోందన్న వాస్తవం. చిన్న సినిమా లేకపోతే సినీ పరిశ్రమ మూతపడుతుంది. నిర్మాతల ఏకఛత్రాధిపత్యం, గిల్డ్ మాఫియా వల్ల మొత్తం నాశనం అవుతోంది. అసలు గిల్డ్‌లో ఉన్నది 27 మంది సభ్యులే. నిర్మాతల మండలిలో 1200 మంది సభ్యులున్నారు. గిల్డ్ సభ్యుల అనేక సమస్యలను నిర్మాతల మండలి పరిష్కరించింది. అందుకే ఓటర్లు మీరే ఆలోచించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోండి" అని కల్యాణ్ తెలిపారు.

దామోదర్ ప్రసాద్‌కు దిల్‌రాజు మద్దతు

నిర్మాతల మండలి ఎన్నికలపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు స్పందించారు. అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న దామోదర ప్రసాద్‌కు మద్దతు పలికారు. ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్ ప్యానెల్ పేరుతో పోటీలో ఉన్న సభ్యులకు ఓటు వేయాలని నిర్మాతలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్యానెల్‌లో ఎక్కువ మంది సినిమాలు చేసే నిర్మాతలే ఉన్నారని, సభ్యుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నీ ప్రోగ్రెసివ్ ప్రొడ్యూస్ ప్యానెల్ అమలు చేస్తుందన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకొచ్చి సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని దిల్ రాజు కోరారు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, D.NO.45-1-1/1, OPP : PORT HOSPITAL, NH-5, AKKAIAPALEM, VISAKHAPATNAM-530004, ANDHRA PRADESH. PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, OPP:SUPER MARKET MAIN ROAD, VISAKHAPATNAM, VISAKHAPATNAM DIST. ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI No: APTEL/2013/54657. Postal: Regd.No.VJA:VJ/042/2021-23, Editorial : 9490952834 Manager : 9490952835, 0891-2730748, E-Mail : vizag_visal@yahoo.co.in